


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 19-08-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 320 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## • కేరళ రాష్ట్రానికి

# జల ప్రళయం





- కేరళకు కేంద్ర సాయం రూ.500 కోట్లు
- రూ. 2000 కోట్లు ఇవ్వాలని కేరళ డిమాండ్
- హెలికాప్టర్‌లో ముంపు ప్రాంతాలను ప్రధాని పరిశీలన
- వరద బాధితులకు మోదీ నష్టపరిహారం
- మృతులు 300 పైనే
- లక్షల సంఖ్యలో నిరాశ్రయులు
- కకావికలమైన జనజీవనం.. ముమ్మరంగా శిబిర సేవలు
- సహాయక చర్యలలో త్రివిధ దళాలు, వివిధ దేశాలు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్థానిక యువకులు

తిరువనంతపురం: భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన కేరళను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. కేరళ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి రూ. 500కోట్ల సహాయ నిధిని ప్రకటించారు. శనివారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ప్రధాని ఈ ప్రకటనను వెల్లడించారు. ఆ తర్వాత వరద ప్రభావిత ప్రాంతాల్లో మోదీ ఏరియల్ సర్వే చేపట్టారు.

### వరద బాధితులకు మోదీ నష్టపరిహారం

కేరళలో వరదల పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని మోదీ తిరువనంతపురం చేరుకున్నారు. అక్కడి నుంచి శనివారం ఉదయం కోచి వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం కోచి నావెల్ బేస్ నుంచి బయల్దేరి ప్రధాని మోదీ ఏరియల్ సర్వే చేపట్టాల్సి ఉంది. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో టేకాఫ్ అయిన కొద్ది సేపటికే విమానం వెనక్కి వచ్చింది. దీంతో సీఎం, అధికారులతో ప్రధాని సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్రానికి తక్షణమే రూ.500కోట్ల సహాయనిధిని అందించనున్నట్లు తెలిపారు. అయితే పరిస్థితి తీవ్రంగా ఉన్న దృష్ట్యా తమకు రూ. 2000 కోట్లు ఇవ్వాలని కేరళ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేసినప్పటికీ.. రూ. 500 కోట్లే ఇస్తామని ప్రకటించడం గమనార్హం. వరదల కారణంగా కేరళ ఇప్పటివరకు రూ.10వేల కోట్ల మేర నష్టం జరిగినట్లు అంచనా.

అంతేగాక వరద బాధితులకు పీఎం జాతీయ సహాయ నిధి నుంచి నష్టపరిహారం కూడా మోదీ ప్రకటించారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2లక్షలు, తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ. 50,000 చొప్పున నష్టపరిహారం అందిస్తామని వెల్లడించారు. అనంతరం వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో తరువాయి 2లో..

## కేరళకు సాయం
# ఏపీ సీఎం రూ.10కోట్లు



అమరావతి: భారీ వర్షాలు, వరదలతో అల్లాడుతున్న కేరళ ప్రజలను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 10 కోట్ల సాయం ప్రకటించారు. వస్తు రూపేణా, ఇతత్రా సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నమని సీఎం తెలిపారు.

వరద బీభత్సం కారణంగా ఇప్పటి వరకూ కేరళలో 324 మంది మృతిచెందారు. దాదాపు 2.20లక్షల మంది నిరాశ్రయులయ్యారు. 1500కు పైగా పునరావాస శిబిరాల్లో బాధితులు ఆశ్రయం పొందుతున్నారు.


# పాక్ ప్రధానిగా ఇమ్రాన్ ప్రమాణస్వీకారం



ఇస్లామాబాద్ : పాకిస్థాన్ 22వ ప్రధానమంత్రిగా మాజీ క్రికెటర్, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్(పీటీఐ) అధినేత ఇమ్రాన్‌ఖాన్ శనివారం తరువాయి 2లో..

# కోఫీ అన్నన్ కన్నుమూత


బెర్న్: ఐక్యరాజ్య సమితి మాజీ సెక్రటరీ జనరల్, నోబెల్ శాంతి బహుమతి పురస్కార గ్రహీత కోఫీ అన్నన్(80) కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా అన్నన్ మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు, కోఫీ అన్నన్ ఫౌండేషన్ ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. చివరి రోజుల్లో భార్య నానే, పిల్లలు అమా, కోజో, నినా ఆయనతోనే ఉన్నారని తెలిపారు. శనివారం ఉదయం అస్వస్థతకు గురైన ఆయనను స్విట్జర్లాండ్‌లోని బెర్న్‌లో ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. గొప్ప వ్యక్తిని, నాయకుడిని, ముందు చూపు గల వ్యక్తిని కోల్పోయామని తరువాయి 2లో..





## ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు

ఢిల్లీ: కాంగ్రెస్ వార్ రూంలో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిర్వహించిన కీలక సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు, సీఎల్పీ లీడర్లతో పాటు ముఖ్య నేతలు అశోక్ గెహ్లాట్, గులాంనబీ ఆజాద్, ఆనంద్ శర్మతో సహ కీలక నేతలు హాజరయ్యారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కుంభకోణాన్ని తరువాయి 2లో..




# టీడీపీ అరాచకత్వం కొనసాగనివ్వం

- ధర్మసాగరం సెజ్ ఎంతమందికి ఉద్యోగాలిచ్చింది?
- నర్సీపట్నాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారు.. ఏమైంది?
- ఇసుక, మట్టిని అమ్ముకుంటున్నారు
- కేరళ విపత్తు హృదయాన్ని కలిచివేస్తోంది
- నర్సీపట్నం భారీ బహిరంగ సభలో జగన్



వార్త 7వ పేజీలో..




## సెప్టెంబరు 15 నుంచి ఆధార్ ముఖ గుర్తింపు

ఢిల్లీ: గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తోన్న ఆధార్ ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) సదుపాయాన్ని ఎట్టకేలకు వచ్చే నెల నుంచి అమలు చేయాలని భారత విశిష్ఠ ప్రాధికార గుర్తింపు సంస్థ ఉడాయ్ నిర్ణయించింది. సెప్టెంబరు 15 నుంచి దశలవారీగా అందుబాటులోకి తెస్తామని ఉడాయ్ ప్రకటించింది. ముందుగా టెలికాం సర్వీస్ ప్రొవైడర్లతో ఈ ఫీచర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.

ఆధార్ కోసం ప్రస్తుతం ఐరిస్, వేలి ముద్రలను స్కాన్ చేస్తుండగా.. ఫేస్ రికగ్నిషన్‌కు కూడా జతచేయాలని గతేడాది ఉడాయ్ నిర్ణయించిన



# భూసార పరీక్షలు తప్పనిసరి



గొలుగొండ : ప్రతి రైతు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేసుకోవాలని ంగా వ్యవసాయ విస్తరణ అధికారి చిట్టిబాబు అన్నారు. శనివారం మండలంలో పుత్తడిగైరంపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చంద్రన్న భూసార పరిరక్షణ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లా డుతూ భూసార పరీక్షలు కారణంగా సాగు చేస్తున్న భూమిలోని ధాతువులలోపం తెలుస్తుం దన్నారు. లోపాలను అధిగమించడానికి కావా ల్సిన జాగ్రత్తలను రైతుల తెలుసు కోవాలన్నారు. అలాగే పరీక్షలా ఆధారంగా ఎరువుల విని యోగం, సస్యరక్షణ చర్యలు రైతులు చేపట్టా లన్నారు. కార్యక్రమంలో భూసార పరీక్ష నిర్వ హించిన పత్రాలను రైతులకు అందచేశారు. అలాగే ఫసల్ బీమా పథకంలో వరి సాగు చేస్తున్న రైతులతో బీమా చేయించడం జరిగింది. ఈ కార్య క్రమంలో జిల్లా టీడీపీ యూత్ సభ్యులు అప్పలనాయుడు, మాజీ ఉపసర్పంచ్ పత్తి రమణ, గ్రామ పెద్దలు రూపల నాయుడు, పత్తి సత్తిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

కొయ్యూరు : ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు జిల్లా పోలీసుశాఖ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు కొయ్యూరు సిఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. చింతపల్లి, పాడేరు కేంద్రాలుగా నిర్వహించనున్న ఈ ఉచిత శిక్షణ కేంద్రాలకు పదో తరగతి ఆపై చదివి ఉండాలన్నారు. గిరిజన కులానికి చెందిన వారు ఈ శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు, 15 రోజులలోగా వారి పేర్లు సమీపంలోని పోలీస్‌స్టేషన్లలో నమోదు చేసుకోవాలని సిఐ ఉదయ్‌కుమార్ సూచించారు. మరింత సమాచారం కోసం 9440904241, 9440904217 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యలమంచిలి రూరల్ : యలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి కొఠారు దుర్గారావు చెప్పారు. 2001 నుంచి 2016 వరకు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ హాజరు కావాలని కోరారు. పాఠశాల ఆవరణలోనే సమ్మేళనం జరుగుతుందన్నారు. 1917లో ఏర్పాటైన పాఠశాలకు ప్రస్తుతం సొంత భవనాలు లేక వేరో చోటుకి తరలించారన్నారు. దీనికి పూర్వ విద్యార్థుల సాయంతో సొంత భవనాలు నిర్మించి పాత స్థలంలోనే బడి నడిచేలా చేయాలన్న లక్ష్యంతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# గీతం విద్యార్థులకు వినూత్న శిక్షణ

## కార్పొరేట్ తరహాలో ఔట్ బౌండ్ కార్యక్రమం



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబిఎ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఔట్‌బౌండ్ పేరిట కార్పొరేట్ కంపెనీల ద్వారా వినూత్న శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనేజ్‌మెంట్ వంటి వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులను నిపుణతను పెంచడానికి, ఒత్తిడిలను తట్టుకోవడానికి, టీమ్ వర్క్‌గా విజయాలు సాధించడానికి అవసరమైన అంశాలను ఔట్ బౌండ్ కార్యక్రమంలో అందించారు. విద్యార్థులను నగరానికి దూరంగా ప్రకృతి మధ్యలో ఉంచి ఈ శిక్షణను అందించారు. దీనికి సంబంధించిన విద్యార్థి బృందాలు గత నెల రోజులుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా మాట్లాడుతూ 1940 వ సంవత్సరంలో డాక్టర్ కుర్ట్‌హాన్ అనే తత్వవేత్త మేనేజ్‌మెంట్ నిపుణతను పెంచడానికి ప్రయోగాత్మకంగా కార్పొరేట్ నిపుణులకు ఔట్ బౌండ్ శిక్షణను సూచించారని తెలిపారు. దీనివల్ల నగరంలో నివశించే యువతీ, యువకులు ముఖ్యంగా మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసించే వారికి ప్రకృతి మధ్య ఉంటూ పాఠాలు నేర్చుకోవడం, తమ శక్తి, యుక్తులను ప్రదర్శించడానికి వేదిక ఏర్పరచటం జరుగుతుందన్నారు. ఈ విధానం మంచి ఫలితాలను ఇవ్వడంతో ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలోనూ ఔట్ బౌండ్ శిక్షణను కార్పొరేట్ కంపెనీలు తప్పనిసరి చేశాయని వెల్లడించారు. ఆగస్టు 18వ తేది వరకు 11 విద్యార్థి బృందాలతో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి వివిధ కార్పొరేట్ సంస్థలలో, బ్యాంకులలో ఉద్యోగాలు సాధిస్తున్న యువతీ, యువకులకు ఈ శిక్షణ ఉపయోగపడుతోందని వెల్లడించారు. కార్యక్రమ చైర్‌పర్సన్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ బిబిఎమ్ విద్యార్థులకు ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశామన్నారు. ఈ తరహా శిక్షణ ద్వారా విద్యార్థులలో ఆత్మ విశ్వాసం పెరగడంతో పాటు లక్ష్య సాధనపై ఏ విధంగా దృష్టి కేంద్రీకరించాలనేది అనుభవ పూర్వకంగా తెలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ విధమైన శిక్షణా కార్యక్రమాలు కార్పొరేట్ రంగంలో ప్రాచుర్యం పొందాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గీతం విశ్వవిద్యాలయంలో మాత్రమే ఈ తరహా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా పలువరు విద్యార్థులు తమకు శిక్షణ ఎన్నో పాఠాలను నేర్పిందని ముఖ్యంగా కార్పొరేట్ రంగంలో టీమ్ వర్క్ ఎలా ఫలితాలిస్తుంది, ఒత్తిడులను తట్టుకోవడానికి గల వివిధ మార్గాలను, ఏకాగ్రతను పెంచుకునే పద్ధతులను, సమస్యలను ఎదురైనప్పుడు వాటి నుంచి దూరంగా పారిపోకుండా పోరాడి ఏవిధంగా పరిష్కరించుకోవాలి అనేది అవగతం అయిందన్నారు. ఔట్‌బాండ్ శిక్షణలో పాల్గొనడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.



**విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 66వ వార్డులోని స్థానిక వార్డు అధ్యక్షుడు దొడ్డికిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాకీ చొక్కాలను ఆటో డ్రైవర్లుకు అందజేసిన విశాఖ నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డా.విజయ ప్రసాద్ మళ్ళ**




చంద్రన్న భీమామిత్ర గా పనిచేస్తున్న పోతిన వెంకట లక్ష్మి సోదరుడు బైపిల్లి రమేష్ 9వ వర్ధంతి సందర్భంగా భీమిలి డివిజన్ తోటవీధి లో ఉన్న అంగన్వాడీ పిల్లలకు మరియు స్థానికంగా ఉన్న అనాథ ఆశ్రమం పిల్లలకు బిస్కెట్లు మరియు పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ... మనిషికి జనన మరణాలు అనేవి సహజం అని , బ్రతికున్న తల్లిదండ్రులనే వృద్ధాశ్రమములో చేర్పించి చేయి దులుపుకుంటున్న ఈ రోజుల్లో పెళ్లి అయి అత్తవారింట్లో ఉంటున్నప్పటికీ తన తోబుట్టువు యొక్క మరణాన్ని గుర్తు చేసుకుంటూ. ఆయన పేరుమీద ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా గొప్పవిషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, కనకల అప్పలనాయుడు, మారోజు సంజీవ్ కుమార్, గిడుతూరి శ్రీనివాసరావు, కొక్కిరి అప్పన్న, దాసరి వెంకటేష్, సత్తరపు శివ పాల్గొన్నారు.

# చంద్రన్నభీమా పరిహారం పంపిణీ



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 24వ వార్డు డెక్కతి పాలెంలో ఇటీవల ప్రమాదంలో మరణించిన కొండపల్లి వీరబాబుకి భార్య మరియు నామిని అయినటువంటి విజయలక్ష్మి కి తక్షణ సహాయం గా 5 వేల రూపాయలు డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు అందజేశారు. నూకరాజు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రము అమలు చేయని విధముగా మన రాష్ట్రములో చంద్రన్న భీమా అమలవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి.డి.పి.పార్టీ నాయకులు గిడుతూరి శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షులు కనకల అప్పలనాయుడు, దాసరి వెంకటేష్, రామారావు స్థానిక జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వకుంటే ఆందోళన

నాతవరం : నిరుపేదలకు ప్రభుత్వ భూములను ఇవ్వాలని లేకుంటే ఆందోళన చేస్తామని సిపిఐ మండల కార్యదర్శి అజయ్ బాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ ఆ భూములు సాగుదార్లకు గతంలో ఎన్నో సార్లు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేసినా ఇంత వరకు ఎటువంటి స్పందన లేదన్నారు. ధర్మవరంలో ఉన్న 450 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములను పేదలకు పెంచాలని ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే నిరుపేదలకు భూములను పంచాలని డిమాండ్ చేశారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION** VIZAG ...ahead

స్వచ్ఛ ఆంధ్ర | స్వచ్ఛ విశాఖ

'e' Procurement Tender Notice No.34/2018-19/E.E-II/DB, Dt:18-08-2018

| | | |
|---|---|---|
| 01. | Number of Works | : 5 Nos |
| 02. | Value of Works (ECV) | : Rs.46.69 Lakhs |
| 03. | Down Loading Starting Date | : 20-08-2018 @ 11.00 PM |
| 04. | Down Loading End Date | : 05-09-2018 @ 2.00 PM |
| 05. | Last date of submission of Bid | : 05-09-2018 @ 3.00 PM |
| 06. | Date of opening Tenders | : 05-09-2018 @ 4.00 PM |

**Note:** For any other details required in respect of above tender notice, please contact **EE-II** before applying for tender schedules and visit us: @ **www.apeprocurement.gov.in.**

For **COMMISSIONER**

స్వచ్ఛ భారత్

ఇంటింట మరుగుదొడ్డి - బహిరంగ మల విసర్జనకు స్వస్తి


**మొదటి పేజీ తరువాయి**

# జలప్రళయం

ప్రధాని మోదీ ఏరియల్ సర్వేను చేపట్టారు. గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కేరళ జలదిగ్బంధంలో కూరుకుపోయింది. ఎటుచూసిన వరదనీరే కన్పిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికే వర్షాల సంబంధిత ఘటనల్లో 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. నేడు కూడా పరిస్థితి ఇలాగే ఉండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

***ప్రకృతి ప్రకోపానికి కేరళ కకావికలం***

***కొనసాగుతున్న సహాయకచర్యలు.. ఆపన్నహస్తమిస్తున్న పలు రాష్ట్రాలు***

దేవభూమిగా పేరుగాంచిన కేరళపై ప్రకృతి కన్నెరజేసింది. భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రం జల విలయంలో చిక్కుకుని అల్లాడుతోంది. గత వందేళ్లలో ఎన్నడూ లేనంతగా వరదలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. ఈ విపత్తుతో కేరళ పరిస్థితి అత్యంత దారుణంగా మారిపోయింది. చాలా చోట్ల ప్రజలు వరదల్లో చిక్కుకుపోయి ఆహారం, నీరు లేక సహాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే దాదాపు 324 మంది ప్రాణాలు కోల్పోయారు. 3.14లక్షల మంది పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. రవాణా వ్యవస్థలన్నీ నాశనమైపోయాయి. ఇంతటి దీనావస్థలో ఉన్న కేరళకు పలు రాష్ట్రాలు, ప్రముఖులు చేయూత ఇస్తున్నారు. త్రివిధ దళాలు ప్రజలను కాపాడేందుకు ముమ్మర సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. రాష్ట్రానికి సుమారు రూ.25వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు ఇంకా కురుస్తూనే ఉన్నాయి. 14 జిల్లాల్లోని 11 జిల్లాల్లో మళ్లీ రెడ్ అలర్ట్ ప్రకటించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించడంతో కేరళ వాసులు ఆందోళన పడుతున్నారు. సహాయక చర్యలు అందిస్తున్న సిబ్బందిని మోదీ ప్రశంసించారు. రాష్ట్ర ప్రజలు వరదలకు ఎదురీది పోరాడుతున్న స్ఫూర్తిని మెచ్చుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కేరళ వరదలను తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని మోదీని కోరారు. డియర్ పీఎం, దయచేసి కేరళ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించండి. ఎంతో మంది ప్రజల జీవితాలు, జీవనాధారాలు, లక్షల మంది భవిష్యత్తు ప్రమాదంలో ఉంది అని రాహుల్ ట్వీట్ చేశారు. కేరళ వరద బాధితుల కోసం ఆహారం, మంచి నీరు సరఫరా చేసేందుకు ప్రత్యేక రైలు శనివారం మహారాష్ట్రలోని పుణె నుంచి బయలుదేరుతోంది. కేరళలోని చిన్నారుల కోసం.. వంద టన్నుల ఆహార పొట్లాలను పంపిస్తున్నట్లు కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనక గాంధీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వంద మెట్రిక్ టన్నుల బాలామృతాన్ని కేరళకు పంపిస్తోంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కేరళకు రూ.10కోట్ల సహాయం ప్రకటించారు. హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టార్ రూ.10కోట్ల సాయం ప్రకటించారు. కేరళకు తెలంగాణ సర్కారు రూ.25కోట్లు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.10కోట్ల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ రూ.10కోట్ల సాయం ప్రకటించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఒక నెల జీతాన్ని కేరళ సహాయ నిధికి ఇవ్వనున్నారు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కేరళ బాధితుల కోసం రూ.కోటి విరాళంగా ప్రకటించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2కోట్ల సాయం ప్రకటించింది.

గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ రూ.10కోట్లు ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రూ.5కోట్ల సాయం ప్రకటించారు. అలాగే సహాయక చర్యలు అందించేందుకు 245మంది అగ్నిమాపక సిబ్బందిని పంపిస్తున్నట్లు తెలిపారు. వీరంతా వరదల సమయంలో సహాయక చర్యలు చేపట్టడానికి శిక్షణ పొందిన వారని, అనుభవం ఉన్నవారని చెప్పారు. ఈ బృందం 75బోట్లను కూడా తీసుకెళ్తోంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవిస్ రూ.20కోట్ల సాయం ప్రకటించారు. ఇక కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక రోజు జీతాన్ని కేరళకు సాయంగా ఇవ్వనున్నారని ఏఐసీసీ తెలిపింది. సహాయక చర్యల్లో ఆర్మీ, నావికా దళం, వైమానిక దళాలతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్థానిక యువకులు పాల్గొంటున్నారు. కేరళలో 58 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని ఎన్డీఆర్ఎఫ్ డీజీ సంజయ్ కుమార్ తెలిపారు. సహాయక సామాగ్రిని అన్ని జిల్లాలకు తరలిస్తున్నారని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ ఏడు వేల మందిని కాపాడిందని, అత్యవసర సహాయం కావాల్సి ఉన్న 150 మందిని సురక్షితంగా రక్షించిందని తెలిపారు. ఆర్మీ, నేవీ, కోస్ట్‌గార్డుల కోసం శనివారం అదనంగా 75 మోటరైజ్డ్ పడవలను, సాధారణ పడవలను, మరో 8 హెలికాప్టర్లను పంపించారు. ఆహార ప్యాకెట్లు కూడా సరఫరా చేశారు. కొచ్చిలో మూడు వేల మంది కోసం కమ్యూనిటీ కిచెన్‌ను నడిపిస్తున్నారు. నావికా దళానికి చెందిన 42 బృందాలు, కోస్ట్‌గార్డు 28 బృందాలను పంపించింది. వీరు మోటారు పడవలతో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వాయుసేన 23 హెలికాప్టర్లు, 11 సరకు రవాణా విమానాలతో సేవలు అందిస్తోంది.

# పాక్ ప్రధానిగా ఇమ్రాన్ ప్రమాణస్వీకారం

ప్రమాణస్వీకారం చేశారు. ఆ దేశ అధ్యక్షుడు మామూన్ హుస్సేన్.. ఇమ్రాన్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం ఇస్లామాబాద్‌లోని అధ్యక్షుడి అధికారిక నివాసంలో జరిగింది.

ఇమ్రాన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన భార్య బుష్రా ఇమ్రాన్, ఆర్మీ చీఫ్ జనరల్ కమార్ జావేద్ భజ్వా, ఎయిర్ చీఫ్ మార్షల్ ముజాహిద్ అన్వార్ ఖాన్, నావెల్ చీఫ్ అడ్మిరల్ జాఫర్ మహముద్ అబ్బాసీతో పాటు భారత మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధు, రమీజ్ రాజా, వసీం అక్రమం, గాయకులు సల్మాన్ అహ్మద్, అబ్రూల్ హక్, నటుడు జావిద్ షేక్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధాని పదవికి పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ అధినేత ఇమ్రాన్‌ఖాన్‌తోపాటు పాకిస్థాన్ ముస్లింలీగ్-నవాజ్ పార్టీ అభ్యర్థి షాబాజ్ షరీఫ్ నామినేషన్లు దాఖలు చేశారు. స్పీకర్ అసద్ ఖైజర్ శుక్రవారం ఎన్నిక నిర్వహించగా.. దిగువ సభలోని మొత్తం 342 మంది సభ్యులకుగాను 272 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇమ్రాన్‌ఖాన్ 176 ఓట్లు సాధించగా.. ప్రత్యర్థి అభ్యర్థి షాబాజ్ షరీఫ్‌కు కేవలం 96 ఓట్లు వచ్చాయి. ప్రధాని పీఠంపై కూర్చోవడానికి 172 ఓట్లు పొందాల్సి ఉండగా.. ఇమ్రాన్‌ఖాన్ నాలుగు ఓట్లు అధికంగా పొందారు. ఈ ఎన్నికలో విజయం సాధించిన ఇమ్రాన్‌ఖాన్ పాకిస్థాన్ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు.

# కోఫీ అన్నన్ కన్నుమూత

ఐరాస వలసల విభాగం ట్విటర్ ద్వారా అన్నన్‌కు నివాళులర్పించింది. ఆఫ్రికా ఖండం నుంచి ఐరాసకు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మొట్టమొదటి నల్లజాతీయుడు అన్నన్. జనవరి 1, 1997 నుంచి డిసెంబరు 31, 2006 వరకూ పదేళ్ళపాటు ఆయన ఆ పదవిలో కొనసాగారు. 2001లో ఆయనకు నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. ఘనాలోని కుమాసిలో జన్మించిన అన్నన్ అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1961లో డిగ్రీ, 1972లో మేనేజ్‌మెంట్ లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. 1962లో బడ్జెట్ అధికారిగా అన్నన్ ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించారు. 1987-92 కాలంలో సహాయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1997లో తొలిసారి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శిగా బౌత్రోస్ బౌత్రోస్ ఘలీ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐరాస ప్రధాన కార్యదర్శిగా ప్రపంచ శాంతి కోసం కోఫీ అన్నన్ ఎంతగానో కృషి చేశారు. సమగ్రాభివృద్ధి, మానవ హక్కుల కోసం కూడా ఆయన పాటుపడ్డారు. ఐరాస నుంచి తప్పుకొన్న తర్వాత కూడా కోఫీ అన్నన్ ఫౌండేషన్ ఛైర్మన్‌గా, నెల్సన్ మండేలా స్థాపించిన ది ఎల్డర్స్ గ్రూప్‌లో సభ్యుడిగా ప్రపంచ శాంతి కోసం తన వంతు కృషి చేశారు. ఘనాలో జన్మించిన ఆయనకు ఆఫ్రికాతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆఫ్రికా అభివృద్ధి కోసం ఎంతో శ్రమించారు.

# ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు

ప్రజల్లోకి తీసుకెళ్లడం, కేరళ ప్రజలను ఆదుకోవడంపై కాంగ్రెస్ నేతలకు రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేశారు. సమావేశానికి హాజరైన ఏపీసీసీ చీఫ్ రఘువీరా రెడ్డి సమావేశం అనంతరం మాట్లాడుతూ..రఫెల్ యుద్ధ విమానాల కొనుగోళ్లలో జరిగిన అవినీతి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రఫెల్ కుంభకోణంలో మోదీ పెద్ద దోషి అని, ఆయనే ప్రధాన దోపిడీదారుడని విమర్శించారు.

రూ.500 కోట్ల విలువ చేసే విమానాలను రూ.1600 కోట్లకు కొనుగోలు చేశారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని మోదీ దోచుకున్నారని, రిలయన్స్ కంపెనీకి డబ్బును దోచిపెట్టారని ఆరోపణలు గుప్పించారు. దేశ రక్షణను పణంగా పెట్టారని తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ రఫెల్ కుంభకోణాన్ని బయటపెట్టినా ప్రధాని మాట్లాడటం లేదు..రఫెల్ కుంభకోణంపై విచారణకు ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. బీజేపీ అవినీతిని ఏవిధంగా బయటపెట్టాలో కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఏపీలో జిల్లా స్థాయి సమావేశాలు, ఓరియెంటేషన్ సమావేశాలు, బూత్ కమిటీల ఏర్పాటు జరుగుతోందని, సెప్టెంబర్ 15 నుంచి 25 వరకు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్‌లో రఫెల్ కుంభకోణంపై ఏపీలో కోటి కుటుంబాలకు కరపత్రాలను పంచుతామని ఈ సందర్భంగా తెలిపారు.

# సెప్టెంబరు 15 నుంచి ఆధార్ ముఖ గుర్తింపు

సంగతి తెలిసిందే. తొలుత జులై 1 నుంచి ఈ ఫీచర్‌ను అమలు చేయాలని భావించింది. అయితే కొన్ని కారణాల వల్ల దాన్ని ఆగస్టు 1కి వాయిదా వేసింది. ఈ నెలలోనూ ఆధార్ ఫేస్ రికగ్నిషన్ ఫీచర్ అందుబాటులోకి రాలేదు. దీంతో తాజాగా సెప్టెంబరు 15 నుంచి దీన్ని అమలు చేస్తామని ఉడాయ్ స్పష్టం చేసింది. ఫింగర్ ప్రింట్‌తో కొన్ని ఇబ్బందులతో పాటు మోసాలు కూడా జరిగే అవకాశమున్నందున ఉడాయ్ ఈ కొత్త ఫీచర్‌ను తీసుకొస్తోంది. ఫింగర్‌ప్రింట్, ఐరిస్‌లతో ఆధార్‌ను ధ్రువీకరించేందుకు వీలులేని పక్షంలో ఈ ముఖ గుర్తింపు ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు.

దశలవారీగా ఈ ఫీచర్‌ను అమలు చేయాలని ఉడాయ్ నిర్ణయించింది. ముందుగా టెలికాం సర్వీస్ ప్రొవైడర్లతో ప్రారంభించనుంది. సెప్టెంబరు 15 నుంచి మొత్తం నెలవారీ లావాదేవీల్లో కనీసం 10శాతం ఫేస్ రికగ్నిషన్‌తో ధ్రువీకరించాలని ఉడాయ్ ఆదేశించింది. లేదంటే ఒక్కో లావాదేవీకు 20 పైసల చొప్పున వసూలు చేస్తామని స్పష్టం చేసింది.

# మధ్యాహ్నా భోజన పథకాన్ని ప్రైవేట్ స్వంచ్ఛద సంస్థలకు అప్పగించం

## మంత్రి గంటా శ్రీనువాసరావు హామీ




విశాఖపట్నంః ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్నాభోజన పథకాన్ని ప్రైవేట్ స్వచ్ఛంధ సంస్థలకు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు గారు మంత్రి గంటా శ్రీనువాసరావుని శనివారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా చర్యలు చేపడతామని మంత్రి హామి ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నా భోజన పథకాన్ని గత 15 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 85వేల మంది మహిళా కార్మికులు సమర్ధవంతంగా నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారని, ప్రభుత్వ నిర్ణయంపై వీరు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారని మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. సెప్టెంబర్ 16 నుండి నయప్రవాస్, సకేతా, ఇస్కాన్ లాంటి సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం మహిళల పొట్టగొట్టడమేనని ఆయన అన్నారు.

అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి సమర్ధవంతంగా ప్రభుత్వానికి ప్రతిష్ట తెచ్చే విధంగా గత 15 సంవత్సరాల నుండి మహిళలు పథకాన్ని నిర్వహిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళారు. మహిళల ఉపాధి దెబ్బతీసే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఈ పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

# చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



విశాఖపట్నం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా కమిషనరేట్‌లోని తన ఛాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల్ని వారి నుంచి స్వాధీనం చేసుకున్న నగలు, ఇతర వస్తువులను ప్రవేశపెట్టి వివరాలు తెలియజేశారు. నిందితులు మర్రి రవికుమార్, వడ్డాది గౌరీష్, ఎ.బ్రహ్మాజీ నగర కమిషనరేట్ పరిధి లోని వివిధ స్టేషన్‌ల పరిధిలోని నిందితులు చోరీలకు పాల్పడు తున్నారని, వీరిపై ఆయా స్టేషన్‌లలో కేసులు నమోదు అయ్యా యన్నారు. పోలీసు సిబ్బంది ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురి నిందితుల్ని అరెస్టు చేయడం జరిగిం దన్నారు. వీరి నుంచి రూ.4,70,000 విలువ చేసే 128.925 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ (క్రైం) దామోదర్, ఏడీసీపీ వి.సురేష్‌బాబు, ఏసీపీ వై.గోవిందరావు, ఇన్‌స్పెక్టర్ పివివిఎస్ఎన్ కృష్ణారావు, పలువురు పోలీసు అధికారలు పాల్గొన్నారు.



# నగరంలో యురోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్

- దేశంలో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్న 11 నగరాల్లో విశాఖ ఒకటిగా ఎంపిక
- ఈ నెల 24 నుండి 28 వరకు వుడా చిల్డ్రన్ ఎరినాలో నిర్వహణకు ఏర్పాట్లు
- 24 సాయంత్రం రెండు చిత్రాల ప్రదర్శన
- పది దేశాలకు చెందిన ఉత్తమ చిత్రాల ప్రదర్శనకు ఏర్పాట్లు
- 18 సంవత్సరములు పైబడిన వారికి ప్రవేశం ఉచితం
- రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నంః విశాఖ నగరం మరో అంతర్జాతీయ పండుగకు వేదిక కానున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ విశాఖ నగరంలో ఈ నెల 24 నుండి 28 వరకూ యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌కు దేశంలో ఢిల్లీ, చెన్నై, పోర్ట్‌బ్లయిర్, పూణే, పాండిచేరి, కోల్‌కటా, జైపూర్, త్రిస్సూర్, గోవా, హైదరాబాద్ మరియు విశాఖ తదితర 11 నగరాలు ఎంపికయ్యాయన్నారు. ఈ 11 నగరాల్లో విశాఖపట్నం ఒకటవ్వడం ఎంతో గర్వకారణమన్నారు. దేశాల మధ్య సంస్కృతి పరివర్తన, మార్పు, తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ నెల 24 నుండి 28 వరకూ వుడా చిల్డ్రన్ ఎరినాలో ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం రెండు చిత్రాలను ప్రదర్శిస్తారన్నారు. పది దేశాలకు చెందిన పది ఉత్తమ చిత్రాలను ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తారన్నారు. 18 సంవత్సరములు పైబడిన వారినే ఈ ప్రదర్శనకు అనుమతిస్తారని, ప్రవేశం ఉచితమని, ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసిస్ ప్రవేశం ఉంటుందని ఆయన తెలిపారు. అయితే ఈ ప్రదర్శనకు హాజరయ్యే వారు ప్రతీ ఒక్కరూ తమ గుర్తింపు కార్డులను తప్పని సరిగా తీసుకురావలసి ఉంటుందన్నారు. ప్రదర్శనకు హాజరయ్యే వారు ప్రదర్శనకు కనీసం 15 నిముషాలు ముందుగానే హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు.

ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను వుడా చిల్డ్రన్ ఎరినాలో అంగరంగ వైభవంగా ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ప్రముఖులు హాజరవుతారన్నారు. యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టరును, బుల్లెట్స్‌ను మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

నగరంతోపాటు జిల్లాలో 18 సంవత్సరములు నిండిన బాలబాలికలు అందరూ ఈ యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ట్రై జంక్షన్ ల్యాండ్ పూలింగ్‌పై ఆందోళన చెందవద్దు

### దళారుల మాటలు నమ్మొద్దు, అన్ని విధాలుగా అందరికీ న్యాయం చేస్తాం

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం: పరవాడ, సబ్బవరం, గాజువాక ట్రై జంక్షన్‌లో జరిగే ల్యాండ్ పూలింగ్‌పై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అందరికీ అన్ని విధాలుగా న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సబ్బవరం మండలం నంగినారపాడు గ్రామంలో శనివారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నంగినారపాడు, వెదుళ్ల నరవ, గంగవరం గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ట్రై జంక్షన్‌లో ల్యాండ్‌పూలింగ్‌పై ఆయా గ్రామాల ప్రజల అభిప్రాయాలను, ఆందోళనలను, సలహాలను, సూచనలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వారి నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు పట్టణ గృహ ప్రాజెక్టులు నిర్మించేందుకు, స్పోర్ట్సు కాంప్లెక్స్ నిర్మాణానికి ఈ జంక్షన్‌లోనున్న సుమారు 900 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించాలని ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. అందులో వున్న నియమ నిబంధనల మేరకు ఈ ఏడాది డిసెంబర్‌లోగా భూసేకరణ పూ ర్తి చేశామన్నారు. భూములు ఇవ్వడానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే భూ సేకరణ మొదలు పెడతామని, అంతేగాని బలవంత సేకరణ చేయమని కలెక్టర్ స్పష్టం చేశారు. భూసేకరణ జరుగుతుందనే ఆందోళణతో మృతి చెందిన లంకా తాతారావు కుటుంబానికి రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియాను కలెక్టర్ ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో వుడా ఉపాధ్యక్షులు పి.బసంత్‌కుమార్, జేసీ జి.సృజన, తేజ్ భరత్, సబ్బవరం తహశీల్ధార్ రామారావు తదితరులతో పాటు గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అక్కిరెడ్డి పాలెంలో ఎమ్‌పిఎమ్ ట్రస్టు వైద్య శిబిరం




విశాఖపట్నంః రాష్ట్ర శాసన మండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎమ్.పి.ఎమ్. ట్రస్టు ఇటీవల ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి శనివారం 65వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలు కలుగుతుందని, సకాలంలో వైద్యం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా డాక్టర్. ఎం.వి.వి.ఎస్. మూర్తి ఉచిత వైద్య శిబిరాల నిర్వహణపై దృష్టి నిలిపిందన్నారు. కలుషిత వాతావరణం కారణంగా కంటి సమస్యలతో పాటు వివిధ రకాల రోగాలతో సతమతమవుతున్న స్థానికులు ఈ వైద్య సేవలు పొందాలన్నారు.ఈ శిభిరంలో మూత్రపిండాల సమస్యలు, స్త్రీలసమస్యలు, క్షయ, మోకాళ్ళలో ఆరుగుదల, గుండె జబ్బులకు, పరీక్షలు జరిపారు. అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిభిరం ద్వారా స్థానికలలో అధికశాతం మంది కంటి సమస్యలు, వినికిడి సమస్యలతో బాధ పడుతున్నట్లు వైద్యలు గుర్తించారు.

గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి, జిమ్సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, పెద్ద ఎత్తున సిబ్బంది వైద్య శిబిరాలలో పాల్గొన్నారు. కాగా శనివారం 200 మందికి దంత పరీక్షలు, 230మందికి కంటి వైద్య పరీక్షలు, 220మంరికి స్త్రీ సంబంధిత పరీక్షలు, 200 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయుకులు పి.బాబులు, ఎస్.నాగరాజు, ఎస్.అప్పలకొండ, కె.చంద్రవతి, ట్రస్ట్ నిర్వాహకులు లేళ్ళ కోటేశ్వరావు, ఆళ్ళ శ్రీనివాసు, పి.వి.రామారెడ్డి, శంకరావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ నియోజకవర్గం మౌళికవసతులు, అభివృద్ధి పనులపై సమీక్ష

### - కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం :- విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంలో సమస్యలపై అధికారులు దృష్టి కేంద్రీక్రరించాలని పరిష్కరించాలని పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యుడు పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన కమిషనర్ హరినారాయణన్‌తో కలిసి అధికారులతో నియోజకవర్గం సమస్యపై సమీక్షించారు. నియోజకవర్గం పరిధిలో నెలకొన్న విద్యుత్తు సమస్యలపై ఈపీడీసీఎల్, జీవీఎంసీ అధికారులు దృష్టిపెట్టాలని, వీధి దీపాలు మరమ్మతులు చేయాలని కోరారు. కొత్తగా స్తంబాలు వేయాల్సిన ప్రాంతాలను గుర్తించాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, కేవలం 40 నిమిషాలు మాత్రమే సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కొండవాలుకు ప్రెజర్ పెంచడం ద్వారా ఎక్కువ నీటిని పంపింగ్ చేయాలన్నారు. నియోజకవర్గంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణంలో సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని పరిష్కరిం చాలన్నారు. కమిషనర్ హరినారాయణన్ మాట్లాడుతూ, నియోజక వర్గంలో నెలకొన్న సమస్యలపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. టిడ్కో అధికారులు గృహ నిర్మాణంపై వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డెంగీ విజృంభిస్తున్న నేపథ్యంలో పజ్రారోగ్య విభాగాధికారులు క్షేతస్ర్థాయి సిబ్బందికి సూచనలిచ్చి వ్యాధిని నియంత్రణలో పెట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందుతున్న ప్రాంతాలను గుర్తించి నాశనం చేయడంతోపాటు, ప్రజల్లో అవగాహన పెంచా లని ఆదేశించారు. సెప్టెంబర్ 15న నిర్వహించనున్న సమీక్షకు సమస్యల పరిష్కారంపై నివేదికతో అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు రమణమూర్తి, సి.హెచ్ రమణమూర్తి, పధ్రాన వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు శివప్రసాద్‌రాజు, పల్లంరాజు, ఇ.ఇలు, ఎ.ఎమ్.ఒ.హెచ్‌లు, ఎపిడిలు, ఇ.పి.డి.సి.ఎల్ ఎస్.ఇలు, ఇ.ఇ లు తదితరులు పాల్గొన్నారు.

# తీరప్రాంతం శుభ్రపరచండి

- బహిరంగ విసర్జన అరికట్టండి - భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించండి

- కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం : సాగర్‌నగర్ తీరాన్ని శుభ్రపరచాలని, మురుగునీటి శుద్ధి కెంద్రం పనితీరు మెరుగుపరచి శుద్ధి చేసిన నీరు సముద్రంలోకి విడిచిపెట్టాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన సముద్రతీరం పరిశీలించారు. జోడుగుళ్ళపాలెం నుంచి సాగర్‌నగర్ వరకు తీరంవైపు రహదారి ప్రక్కన వేసిన భవన నిర్మాణం వ్యర్థాలు తొలగించాలన్నారు. తీరంలో ఇసుకలో చెత్త, చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను పట్టుకుని సీజ్ చేయాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. మత్స్యకారులతో మాట్లాడి, బహిరంగ విసర్జన చేయకూడదని, తద్వారా వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. మత్స్యకారుల సౌకర్యార్థం మరుగుదొడ్లు ఉన్నాయని వాటిని వినియోగించాలని కోరారు. సాగర్‌నగర్ పరిసరాల్లో డెంగూ, మలేరియా కేసుల వివరాలపై ఆరాతీస్తూ, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, సహాయ వైద్యాధికారి జయరాం, కార్యనిర్వాహక ఇంజనీరు ఉదయ్‌కుమార్, డి.ఇ దిలీప్, టిపిఓ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# 41వవార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కంచరపాలెం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గణబాబు చేస్తున్న కృషి నిరుపమానమని 41వవార్డు టీడీపీ అధ్యక్షులు పెంటకోట త్రినాధరావు అన్నారు. జివియంసి 41వవార్డు పరిధి సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు ఆయన వార్డు నాయకులతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు జివి యంసి నిధులు 16 లక్షల వ్యయంతో రోడ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అలాగే 415 మందికి ఇళ్ళ పట్టాల మంజూరు, 521 మందికి పెన్షన్లు, చంద్రన్న బీమా 51 మందికి, పెళ్లి కానుక 6గురికి ఇప్పటివరకు అందజేశామన్నారు. ఈ కార్య క్రమంలో పెంటకోట అజయ్‌బాబు, కార్తీక్ కుట్టా, పీలా వెంకటరమణ పాల్గొన్నారు.

# గీతం ఐఇఇఇ విభాగం వర్క్‌షాప్



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం తేది 18-08-2018న వర్చ్యువల్ రియాలిటీ పై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి 120 మందికి పైగా విద్యార్థులు దీనికి హజరైయ్యారు.కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వైస్ ప్రిన్సిపాల్ సి.ధర్మరాజు, స్మార్ట్ విజడ్ ఎక్స్ మాజీ ఉపాద్యక్షుడు శైలేష్ కుమార్, డిజైనింగ్ విభాగం అధిపతి ఆకాష్ కుట్టప్ప, కమ్యూనిటీ మేనేజర్ సుభమాన్ సింగ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.విద్యార్థి విభాగం అద్యక్షుడు ఎస్. యోగేష్ వర్క్‌షాప్ ప్రాధాన్యత వివరించారు.

# విజయభాను

## సంపాదకీయం

## జలవిల

కేరళ ప్రజలు వరద నీటిలో చిక్కుకొని ఆర్తనాదాలు చేస్తున్నారు. రాష్ట్రంలోని పద్నాలుగు జిల్లాల్లో పదమూడు వరద బీభత్సానికి విలవిలలాడుతున్నాయి. కేరళ రాష్ట్రమే జలమయమైం ది. ఒకటి రెండు రోజుల్లోనే వంద మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నెలలో వరదల మూలం గా సుమారు 170 మంది మరణించినట్టు తెలుస్తున్నది. దాదాపు రెండున్నర లక్షల మంది సహాయ శిబిరాలలో తలదాచుకున్నారు. దవాఖానలు, సహాయ శిబిరాలలోకి కూడా వరదనీ రు వచ్చిచేరుతున్నది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సహాయ కార్యక్రమాలు చేపట్టడానికి కూడా వీలుకాని దయనీయ స్థితి నెలకొన్నది. త్రివిధ దళాలు రంగంలోకి దిగడంతో కొంతమే ర సహాయ కార్యక్రమాలు సాగుతున్నాయి. వందలాది మరపడవలతో సహాయ కార్యక్రమాల ను చేపడుతున్నారు. ఇండ్లలో చిక్కుకుపోయిన వారిని గుర్తించి నప్పటికీ, వారిని కాపాడలేని నిస్సహాయత ఆవరించింది. దాదాపు ఎనిమిది వేల కోట్ల రూపాయల పంట నష్టం జరిగిందని అంచనా. మౌలిక వసతులు కూడా దెబ్బతిన్నాయి. ప్రజలు కోల్పోయినదెంత అనేది లెక్కలకు అందనిది! 1924 తరువాత ఇంత భారీ వర్షాలు కురియడం ఇదే మొదటిసారి. వరదల పాలైన కేరళ రాష్ట్రాన్ని ఆదుకోవడం అందరి బాధ్యత. ఈ వరదల బాధ నుంచి ఉపశమనం పొందిన తరువాత, ఈ బీభత్సానికి కారణమేమిటి? ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటే ఈ జల ప్రళ యం తప్పేదా అనేది చర్చించుకోవడం అవసరం. డ్యామ్‌లలోని వీటిని కొద్దికొద్దిగా విడుదల చేయకుండా ఒకేసారి వదిలారనే విమర్శ వినబడుతున్నది. కానీ పర్యావరణ పరిరక్షణ విధానాలను నిర్లక్ష్యం చేయడం అసలు కారణమనే అభిప్రాయం కూడా బలంగా ఉన్నది. పశ్చిమ కనుమలు పర్యావరణ పరంగా అత్యంత సున్నితమైన ప్రాంతం. ఈ కనుమల ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి ప్రముఖ పర్యావరణ వేత్త గాడ్గిల్ నేతృత్వంలోని కమిటీ 2011లో నివేదిక ఇచ్చింది. పశ్చిమ కనుమలలోని అనేక ప్రాంతాలను పర్యావరణ సున్నిత ప్రాంతాలుగా గాడ్గిల్ కమిటీ గుర్తించింది. లక్షా నలభై వేల కిలోమీటర్ల పొడవైన పశ్చిమ కనుమలను మూడు మండలాలుగా వర్గీకరించింది. ఈ మండల పరిరక్షణకు ఏయే చర్యలు తీసుకోవాలో సూచించింది. కొన్ని ప్రాంతాలలో గనుల తవ్వకం, కొండలు పగుల కొట్టడం, భారీ భవనాలు కట్టడం మొదలైన పర్యావరణానికి ముప్పు కలిగించే కార్యకలాపాలను నియంత్రించాలని గాడ్గిల్ కమిటీ సూచించింది. అటవీ ప్రాంతాన్ని ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని హితవు చెప్పింది. ఈ సూచనల పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గాడ్గిల్ దిష్టిబొమ్మలను దగ్ధంచేసే స్థాయికి ఆందోళన చెలరేగిం ది. అయితే రైతుల భూములు పోతాయంటూ తప్పుడు ప్రచారం సాగడం వల్ల ఈ ఆందోళన తలెత్తిందనే అభిప్రాయం ఉన్నది. పర్యావరణానికి ప్రమాదం కలిగిస్తున్న గనుల తవ్వకం, ఇతర కార్యకలాపాలకు చెందిన లాబీలు ప్రజలను రెచ్చగొట్టాయనే ఆరోపణలు ఉన్నాయి. కేరళ ప్రభుత్వం గాడ్గి ల్ కమిటీ నివేదికను తిరస్కరించి కస్తూరి రంగన్ కమిటీని నియమించింది. ఈ కమిటీ పర్యావరణ సున్నిత ప్రాంతాలను కుదించింది. అయినప్పటికీ ఈ నివేదికపై కూడా వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాటి ముఖ్యమంత్రి ఉమన్ చాంది మరో కమిటీని వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు వివరించి గాడ్గిల్ కమిటీ సూచనలను అమలు చేస్తే ఇవాళ ఇంత విషాదం నెలకొనక పోయేది. కానీ ప్రజా ప్రతినిధులు బాధ్యతారహితంగా వ్యవహరించారు. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ప్రకృతి వనరులను పరిరక్షించే ప్రాజెక్టులను చేపట్టాలని కూడా గాడ్గిల్ కమిటీ సూచించింది. కానీ దానిని కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేరళలో పర్యాటక అభివృద్ధి పేరుతో కొండ ప్రాంతాలలో మత సంస్థలు, హోటళ్ళ పేర భారీ భవనాల నిర్మాణాన్ని అనుమతించారు. అడవులు నరకడం, గనుల తవ్వకం విచ్చల విడిగా సాగింది. దీంతో కొండ చర్యలు విరిగిపడుతున్నాయి. ఇప్పుడ కేరళ వరదలలో ప్రజలు చనిపోయింది ఎక్కువగా కొండ చరియలు విరిగిపడటం వల్లనే. మానవ కార్యకలాపాలు సాగే ప్రాంతాలలోనే బీభ త్సం ఎక్కువగా ఉన్నది. ఒక్క కేరళ రాష్ట్రమే కాదు, పశ్చిమ కనుమల ప్రాంతానికి అనుకుని ఆరు రాష్ట్రాలు ఉన్నాయి. ఈ ఆరింటిలో ఏ ఒక్క రాష్ట్రం కూడా గాడ్గిల్ కమిటీ సూచనలను అమలు చేయలేదు. పర్యావరణ పరిరక్షణ చర్యల పట్ల ఆసక్తి ప్రదర్శిం చడం లేదు. కేరళలో ప్రకృతి ప్రకోపానికి మరో కారణం కూడా ఉన్నది.

## మాజీ ఎం.పి చెన్నుపాటి విద్యకు ఘనంగా నివాళి

విజయనగరం:ఆంధ్రప్రదేశ్ గాంధీస్మారకనిధి రాష్ట్ర అద్యక్షురాలు, మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య ఆకస్మిక మరణంపట్ల ఆంధ్రప్రదేశ్ గాందీ .స్మారకనిధి ప్రగాడ సంతాపం తెలియ జేసింది. శనివారం సంస్థ కార్యాలయంలో జరిగిన చెన్నుపాటి విద్య సంతాప సభలో సంస్థ సభ్యులు ఆమె చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అద్యక్షులు రొంగలి పోతన్న మాట్లాడుతూ చెన్ను పాటి విద్య కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలనేతగా, పార్లమెంటు సభ్యురాలిగా ఎనలేని సేవలందించారన్నారు. ఆమె పార్లమెంటు సభ్యురాలుగా జిల్లా పార్టీ పరిశీలకురాలిగా పనిచేసిన సందర్భంలో ఆమెతో గల పరిచయాన్ని పోతన్న గుర్తు చేసుకున్నారు. గాంధేయవాధం, నిరాడంబర లకు ఆమె ప్రతిరూపమన్నారు. గాందీ ఆశయాలను ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ఆమె విశేష కృషిచేసారన్నారు. ఆమె మరణంతో గాంధీ స్మారకనిధి గొప్ప నేతను కోల్పోయిందని పోతన్న విచారం వ్యక్తం చేశారు.పట్టణ విభాగం అద్యక్షులు ధవళ సర్వేశ్వరరావు మాట్లాడుతూ చెన్నుపాటి విద్య నిరంతరం సమాజ సేవలోనే జీవించారని, గాంధీసార్మరకనిధి వ్యవస్థాపక అద్యక్షురాలిగా మా అందరికి మార్గదర్శిగా నిలుస్తామన్నారు.పివి నరశింహరాజు , పెద్దింటి అప్పారావు, త్రినాద్ ప్రసాద్‌లు చెన్నుపాటి విద్య సేవలను కొనియాడారు.సంతాప కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మహమ్మద్ భాషా.

మజ్జి కాంతారావు, సిహెచ్ చిన్నంనాయుడు, శేశారావు, బసవ మూర్తి, హృషీకేశం, గంగా ప్రసాద్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## గళమెత్తిన యువకవులు

విజయనగరం: గుజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం రాత్రి మహాత్మాగాంధి స్మారక నిధి జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీ స్ఫూర్తి అంశంగా కవి సమ్మేళనం జరిగింది. సభాధ్యక్షులు దవళ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతరత్న అటర్‌బిహారి వాజ్పఆయి చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. అనంతరం ముఖ్య అతిధిగా పాల్గొన్న రొంగలిపోతన్న మాట్లాడుతూ గాంధీ అనుసరించి సత్యాగ్రహం, అహింసలతో విజయాలు సాధించగలిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.లక్ష్మణరావు నిర్వహణలో 30 మంది కవులు తమ కవితలు విన్పంచారు.

## జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల విజేతలు వీరే

విజయనగరం: ఈనెల 20వ తేదీన జరగనున్న గ్రంథాలయ ఉద్యమ పితామహులు పాతూరు నాగభూషణం జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో " గ్రంథాలయాలు - ఆవశ్యకత" అనే అంశంపై ఉడాకాలనీ గురజాడ పాఠశాలలో జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతల వివరాలను విజయనగరం పట్టణశాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్స్ విభాగంలో మొదటి మూడు స్థానాలను గురజాడ స్కూలు, మహారాజా సంస్కృత కళాశాల, శ్రీ శారదా విద్యాపీఠ్ విద్యార్థులు, జూనియర్స్ విభాగంలో చాణక్య స్కూల్, శారదా విద్యాపీఠ్, రామవరం జడ్పీ హైస్కూలు, తోటపాలెం గాయత్రి స్కూల్, సబ్ జూనియర్స్ విభాగంలో గురజాడ, తోటపాలెం గాయత్రి, ఆదిత్య స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారని, విజేతలకు 20వ తేదీ ఉదయం 10 గంటలకు గురజాడ పాఠశాలలో బహుమతి ప్రదానం ఉంటుందని ప్రకటనలో పొందుపరచారు.

## వైద్య కళాశాల వచ్చేదాకా పోరాటం ఆగదు: లోక్‌సత్తా



విజయనగరం: జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల సాధించేవరకు అలుపెరుగని పోరాటం చేస్తామని లోక్‌సత్తా పార్టీ విజయనగరం నియోజకవర్గం అధ్యక్షులు అల్వాంశెట్టి నాగభూషణం అన్నారు. శనివారం పార్టీ కార్యలయంలో జరిగిన కార్యకర్తల సమావేవంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏ పార్టీకి అధికారం వచ్చినా , ఏ ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజాప్రతినిధులు మారుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిమందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్న ఆలోచన కూడా లేదని విచారం వ్యక్తం చేశారు. లోక్‌సత్తా గురుజాగృహం కోసం చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి 21 రూపాయలు ఆధునీకరణ కోసం మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాజారావు, గురునాధం, పిఎల్ఎన్ రాజు, యిర్నిబాబు తదితరులు ప్రసంగించారు.

## చిన్నశ్రీనుకు బ్రహ్మకుమారీస్ రక్షాబంధన్



విజయనగరం: రక్షాబంధన్ సందర్భంగా స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సంస్థ ప్రతినిధులు బి.కె.లత, బి.కె.మాధురి, బి.కె.గణేష్‌లు శనివారం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) నివాసంలో వారు కలిసి శ్రీనివాసరావుకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియ జేశారు.నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ప్రజలకు సేవలందిస్తున్న శ్రీనివాసరావు ఆధ్యాత్మిక సేవలు ద్వారా పరమశివుని ఆశీర్వాదం పొందాలని వారు ఆయనకు హితోపదేశం చేశారు.
బి.కె.ప్రతినిధులకు శ్రీనివాసరావు ధన్యవాదములు తెలియ జేస్తూ ఎల్లవేళలా తనకు మహాశివుని కరుణ కలిగేలా ఆశీసులందించాలని బ్రహ్మకుమారీలకు నమస్కరించారు.

## కవి సమయం

### 'సృష్టి శోకం'

వారి పరిపాలన అలానే ఉంటుంది
మార్పులు - చేర్పులుండవు
వారి పరిపాలనలో...హాని చెయ్యని జంతువేది?
హాని పొందని జంతువేది?
ఈశ్వరుని ఆజ్ఞ లేనిదే
చీమైనా కుట్టదందురు ...వారి
పూర్తిగా చావనివ్వరు
పూర్తిగా బ్రతకనివ్వరు
చావు-పుట్టుకలేని
స్వర్గసీమలో ఉంచనివ్వరు
ఎండలకు-వానలకు ప్రాణాలు
అల్లకల్లోలం జేయుచుందురు ...వారి
అడవుల్లో జంతువులను ఆకలి అనే
ఆవేదన సృష్టించి ఒక జంతువుని
ఇంకొక్క జంతువు బలి తీసుకొనునట్లు చేతురు
బాహ్య ప్రపంచంలో మనుష్యులను ఆకలిని, కోరికలను
సృష్టించి ఒకర్ని-ఒకరు మోసం చేయునట్లు చేతురు
నీటిలో జలచరములను ఆకలి సృష్టించి
ఒకదానిని ఒకటి చక్షించినట్లు చేతురు ...॥వారి॥
జీవి చస్తే కాల్చి బూడిద చేయుటకన్నా!
జీవి చస్తే భూమిలో పాతి మట్టి చేయుటకన్నా!
ఒక జంతువు కాహార్యం అగుట మిన్నయని
ఆ, భగవంతుడు జంతువులను అలా చేస్తున్నాడు కాబోలు ...వారి
నీ ఆకలికి వేరే జంతువో! వృక్షమో! కావాలిగదా!
మరి ఆ జంతువు ఆకలికి నువ్వో! ఇంకొక్క జంతువో!
కావాలిగదా!
నువ్వు-నీలాంటి వాళ్లు చిరంజీవిగా భువిపై ఉంటే
రాబోయే తరంవారి గతి భువిపై ఏది?
అందుకే
నీ వ్రాత వ్రాసింది ఒకరు
నీచే చేతలు చేయించింది ఒకరు
నీ కాలం మూడిందని ప్రాణం తీసుకుపోయింది ఒకరు ...॥వారి॥
నన్ను పుట్టించమన్నానా!
నన్ను చంపమన్నానా!
మధ్యన కన్ను నానా పాట్లు పెట్టమన్నానా!
అని గోడు పెట్టుకున్నా! ఆలకించరే- కన్పించరే
ఏ రాయినో! పుట్టనో! చెట్టునో! చెప్పుకోవాలే తప్పా!
ఇక స్ట్రయిక్‌లు, సమ్మెలు - ఏం చెయ్యగలరు ...॥వారి॥

... కవితా రచన
యల్.సిద్ధు
సెల్ నెం:7702977293

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : నవమి పూర్తి; అనూరాధ రా.11.04; తె.వ.5.02ల | ఆదివారం 19-08-2018

**మేషం** : వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం ఆర్థిస్తారు. **వృషభం** : వ్యవసాయ, ఎగుమతి, దిగుమతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు. **మిథునం** : స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం. **కర్కాటకం** : రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాలో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం** : కుటుంబీకుల మధ్య ఆసక్తికరమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య** : బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **తుల** :మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. **వృశ్చికం** : క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకు తగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, **ధనుస్సు** : ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూల మవు తుంది. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం. **కుంభం** : మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. **మీనం** :నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం.

## అద్భుతంగా వైజాగ్ స్కూల్ ఛాంపియన్స్ ప్రిలిమ్స్



విశాఖపట్నం : వీరుమామ వీ టీం ఎంటర్టైన్మెంట్ నెట్వర్క్స్ ఆధ్వర్యంలో వైజాగ్ స్కూల్ ఛాంపియన్స్ ప్రిలిమ్స్ చాలా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశేఖ అధికారి డి.లింగేశ్వర రెడ్డి గారు ప్రారంభించారు.అయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఇంకా ఎన్నో నిర్వహించాలి,ఇలాంటి కార్యక్రమాల వాళ్ళ పిల్లలలో ఎంతో సృజనాత్మకత పెరుగుతుంది అని తెలిపారు.సుమారు 650 మంది వెస్ట్రన్ డాన్స్ ,క్రియేటివ్ ఫాన్సీ డ్రెస్,టాప్ స్పీకర్,డ్రాయింగ్ పోటీలలో పాల్గున్నారు. న్యాయ నిర్ణేతలుగా కార్పొరేట్ ట్రైనర్ సోనియా జైన్, ఇంటర్నేషనల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ సంధ్య పట్నాయక్ ,పొట్టి రమేష్ మాస్టర్ , సంతోష్ మాస్టర్,శ్రీనివాస్ మాస్టర్,భువన్ మాస్టర్ వ్యవహరించారు. ఇందులో అన్ని ప్రముఖ పాఠశాలలు పోల్గనటం చాలా ఆనందదాయకం అని, ఈ ఈవెంట్ గ్రాండ్ ఫినాలే ఈ నెల ఇరవై ఐదునసిరిపురం గురజాడ కళాక్షేత్రం లో జరుగుతుందని వీరు మామ ఒక ప్రకటనలో తెలియజేసారు. ముఖ్య అతిధి గా రాష్ట్ర విద్యా శాఖ మాత్యులు గంటా శ్రీనివాస రావు, విశిష్ట అతిధిగా పద్మిని కచ్చపి అమెరికా నుండి,సెలబ్రిటీ డాన్స్ జడ్జి గా టాలీవుడ్ నుండి యానీ మాస్టర్(మహానటి,గబ్బర్ సింగ్ ఫేమ్) ,మిస్సెస్ ఇండియా కల్చరల్ అంబాసిడర్ శ్రీమతి పూజ శారదా,అంతర్జాతీయ పెయింటింగ్ ఆర్టిస్ట్ సంధ్య, కార్పొరాటే ట్రైనర్ సోనియా జైన్ వ్యవహరిస్తారని ,ఇందులో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంస పత్రం,బహుమతి ప్రదానం చేస్తామని,మాతృ బాషా దినోత్సవం సంబంధించి మా తెలుగు తల్లి గేయం కచ్ఛపీ స్వరదారా ఆధ్వర్యంలో సుమారు రెండు వందల మందితో పాడ్తారని, ఈ కార్యక్రమానికి అందరు ఉచితముగా వొచ్చి ఒక మెగా ఈవెంట్ ను తిలకించవచ్చని వీరుమామ తెలిపారు.





## ఆసియా క్రీడలు ప్రారంభ సంరంభం



జకార్త: ఇండోనేసియా వేదికగా 2018 ఆసియా క్రీడల సంరంభం మొదలైంది. నాలుగు నంవత్సరాలకొకసారి నిర్వహించుకునే పదహారు రోజుల సంగ్రామానికి తొలి వేడుక అట్టహాసంగా ప్రారంభమైంది. 18వ ఆసియా క్రీడలు ఇండోనేసియా రాజధాని జకర్తాలో అంగరంగ వైభవంగా మొదలైంది. ఇండియా నుంచి ఇండోనేసియా చేరుకున్న టార్చ్‌తో క్రీడాజ్యోతిని వెలిగించి బాడ్మింటన్ లెజండరీ ప్లేయర్ సుశి సుశాంత్ వేడుకులకు గ్రాండ్ ఓపెనింగ్ ఇచ్చారు. క్రీడాకారులు, కళాకారులతో గెలోరా బుంగ్ కర్నో స్టేడియం కన్నుల పండువగా నిలిచింది. స్థానిక సంప్రదాయ కళారూపాలతోపాటు, లైట్ షో ఆహూతులను విపరీతంగా అలరించాయి. జావెలిన్ త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా భారతీయ క్రీడా, అధికార బ ృందానికి పరేడ్‌లో నాయకత్వం వహించాడు. 45 దేశాల నుంచి 10 వేలకు మందిపైగా అథ్లెట్లు ఈ క్రీడల బరిలో ఉన్నారు. భారత్ నుంచి 572 మంది అథ్లెట్లు 36 క్రీడాంశాల్లో పోటీ పడుతున్నారు. పోటీలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి.

# ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

## నీట మునిగిన పంటపొలాలు, కాలనీలు





యానాం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పంటపొలాలు, కాలనీలు నీట మునిగాయి. గత రెండు రోజులుగా వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో యానాం గోదావరి వెంబడి అనుకొని ఉన్న లంక ప్రాంతాలలోని వందలాది ఎకరాలు నీటమునగగా పలు కాలనీలు జలమయమవ్వగా బాధితులను అధికారులు పునరావస కేంద్రాలాకు తరలించి భోజన సదుపాయాలు కల్పించారు. పరంపేట, భీమ్‌నగర్, లంక భూములలోని వందలాది ఎకరాలు నీట మునిగాయి. రాజీవ్ గాంధీ బీచ్, ఫ్రాన్స్‌తిప్ప, కోనా వెంకటరత్నం నగర్, వీరభద్రకాలనీ, పరంపేటలోని ఆడపడుచుల కాలనీలు వరద నీటితో మునిగాయి. ఆ ప్రాంతాలలోని సుమారు 1200 మంది నిరాశ్రయులను పునరావాస కేంద్రానికి తరలించి భోజన సదుపాయాలు ఏర్పాటుచేశారు. పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు మున్సిపల్ కమీషనర్ జి గౌరీసరోజ, ప్రజాపనుల శాఖ ఇఇ రాందాసు, జెఇ ఎంవై హుసేన్, మేడిశెట్టి రామలింగేశ్వరరావులు ముప్పు ప్రాంతాలలో పర్యటించి పరిశీలించారు.

వరద ఉధృతి మరింత పెరిగేఅవకాశం ఉందని ముప్పు ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలని సూచించారు. అధికారుల అనుమతి లేకుండా గోదావరిలోని పర్యాటకులు ఎవరూ వెళ్ళవద్దని సూచనలుచేశారు. సావిత్రినగర్, గిరియపేట, దరియాలతిప్ప, సీతారాంనగర్, దుమ్మేటివారిపేట, పరంపేట, అయ్యన్న నగర్, కురుసంపేట, సుభద్రనగర్, ఓల్డ్‌రాజీవ్‌నగర్, బాలయోగి కాలనీ, పలుప్రాంతాలలోని పర్యటించి గోదావరిని అనుకొని ఉన్న క్లూయిజ్‌లను ఇసుక బస్తాలతో మూసివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వరద ఉధృతిని పర్యవేక్షించేందుకు వివిధ శాఖాధికారులను గోదావరి వెంబడి నియమించారు. పరిస్థితులను పుదుచ్చేరి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించినట్లు పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు.

## ఆగని ఇసుక తరలింపు

తాళ్లరేవు: మండలంలోని పిల్లంక, గోవలంక ప్రాంతాలలో వరదగోదావరిలో ఇసుక తరలింపు యదేచ్ఛగా కొనసాగుతుంది. ఎర్రనీటి ఒడ్డున అంచులను తాకుతూ ఉధృతంగా సముద్రంవైపు కదులుతున్న వర్షాలు వరదలు వచ్చే సమయంలో గోదావరిలో ఇసుక తీయకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోకుండా లారీలు, ట్రాక్టర్లపై దళారులు ఇసుకను తరలిస్తున్నారు. వరద వచ్చే సమయంలో ప్రమాదం అని తెలిసినా అవిఏవీ పట్టించుకోవడం లేదు రేవులో నావలపై ప్రయాణించేవారిని అధికారులు అప్రమత్త చేస్తున్నారు. ఈ అక్రమ ఇసుక తరలింపుపై అధికారులు నోరుమెదపకపోవడంతో వరద సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని దీనిపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## టైటిల్‌లాక్ గేట్లు మూసివేత

తాళ్లరేవు: ఆత్రేయ నదీపాయపై యానాం కురుసంపేట వద్ద ఉన్న టైటిల్‌లాక్ గేట్లను దవళేశ్వరం ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్తగా గేట్లు మూసివేయడంతో వేలాది ఎకరాలకు వరద ముంపు తప్పింది. వరద ఉధృతి అధికమవుతున్న సమయంలో ఇరిగేషన్ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గేట్లు వేసేందుకు అధికారులు ప్రయత్నించినప్పుడు టైటిల్‌లాక్ ఎడమవైపు గేట్లు కొద్ది గంటలపాటు పడకపోవడంతో కొంత ఉత్కంఠకు దారితీసింది. ఈ నదీ పాయ వెంబడి వేలాది ఎకరాలు వరిపొలాలు ముప్పుబారిన పడకుండా ఈ టైటిల్‌లాక్ గేట్లను 1983లో ఏర్పాటుచేయడం జరిగింది. ఈ నదీపాయ అక్రమ ఇసుక తరలింపుకు తాళ్లరేవు వైపు ప్రధాన నదీ కేంద్రంగాఉంది. ఈ గేట్లు మూసివేయడంతో అక్రమ ఇసుక తరలింపుకు గండిపడింది. ప్రస్తుతం గోదావరిలో ఉన్న అన్ని నావలు ఈ నదీపాయలోకి తరలించి గేట్లను మూసివేశారు. వరద ఉధృతి తగ్గేవరకు ఈ గేట్లను తెరవని పరిస్థితి నెలకొంది.

## వైయస్.జగన్మోహన్ రెడ్డిని కలిసిన గ్రామీణ వైద్యులు

నర్సీపట్నం: విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో జరిగిన ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్ రెడ్డి గార్ని బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ నర్సీపట్నం శాఖ ఆద్వర్యంలో బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లు.వామన మూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి షేక్ బాబు, నర్సీపట్నం మండల అధ్యక్షుడు నాయుడు మరియు అసోసియేషన్ సభ్యులుతో కలసి గ్రామీణ వైద్యుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు వైయస్.జగన్మోహన్ రెడ్డిని కలసి గ్రామీణ వైద్యుల సమస్యలపై ఒక వినతి పత్రాన్ని సమర్పించి దానిపై చర్చించారు. అందుకు ఆయన సానుకూలముగా స్పందించి అధికారంలోకి రాగానే తప్ప కుండా గ్రామీణ వైద్యులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ వైద్యుల సమస్యలపై తక్షణము స్పందించిన రాష్ట్ర ప్రతిపక్ష నేత వైయస్.జగన్మోహన్ రెడ్డికి అసోసియేషన్ తరుపున గొల్లు.వామన మూర్తి, షేక్.బాబు, నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.

## వెంకన్నను దర్శించుకున్న డిఎస్‌పి

రావులపాలెం: కోరిన కోర్కెలు తీర్చే కలియుగ ప్రత్యక్ష దైవం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామిని శనివారం విజయవాడ ఇంటిలిజెన్స్ డిఎస్‌పి ఎ. సుభాష్‌చంద్రబోస్ దర్శించుకున్నారు. వీరిని ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం గావించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని ఆయనకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏవియన్ కళాశాలలో రక్తదాన శిబిరం



విశాఖపట్నం: స్థానిక మిసెస్ ఏవియన్ కళాశాలలో ఎన్‌సిసి మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వారి సౌజన్యంతో శనివారం రక్తదాన కార్యక్రమం జరిగింది.

ఈ రక్తదాన శిబిరంకు 13 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నర్ డివిఎల్ఎన్ఎస్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయ్యడం వల్ల ఆపదలో ఉన్న నిండు ప్రాణాన్ని కపాడవచ్చు నన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ రక్తదానం చేయ్యడానికి ప్రతిఒక్కరు స్వచ్ఛందంగా రావాలని పిలుపునిచ్చారు. కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డా॥ ఎన్ రామకృష్ణ మాట్లాడుతూ రక్తదానం మానవతా విలువలతో కూడిన గొప్ప సామాజిక సేవ అని అన్నారు. ఎన్‌సిసి కేడిట్లు తప్పనిసరిగా ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చెయ్యాలని పిలుపునిచ్చారు. కెప్టెన్ డాక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం లో దాదాపు 72 మంది విద్యార్థులు, స్వచ్ఛందం గా పాల్గొని రక్తదానం చేశారు.

ఈ శిబిరంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్, ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ వారు పాల్గొన్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నుండి సత్యనారాయణ మూర్తి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఆచార్య సిహెచ్ శ్రీనివాసరావు, శ్రీమతి ఇందిరా, మల్లిక్, ఎన్‌సిసి ఆఫీసర్లు జె.ఆర్. రావు, సునిత, ఆచార్య ఎస్. శ్రీనివాసరావు, ఆచార్య సిహెచ్ మదుసూధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 31న రత్నగిరిపై వరలక్ష్మి వ్రతాలు

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు ది.31-8-2018 శ్రావణ శుక్రవారం ఉదయం 9-00గం.లకు శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మండపం నందు మరియు వైరుతి వాయువ్య వ్రత మండపముల యందు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతములు నిర్వహించబడును. కావున వరలక్ష్మి వ్రతములు నిర్వహించుకొను గృహిణులకు లక్ష్మిదేవి రూపు, రవిక, గోధుమ నూక ప్రసాదము(100 గ్రా.లు), పసుపు, కుంకుమ, అగరబత్తి, కర్పూరము మొదలగు పూజా సామగ్రి దేవస్థానం నుండి సమకూర్చబడును. మరియు వరలక్ష్మి వ్రతము నిర్వహించుకొను స్త్రీలు కొబ్బరికాయలు,అరటిపండ్లు, పూలు, గాజులు మాత్రమే తెచ్చుకొనవలసి యుండును. కావున భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై వరలక్ష్మి వ్రతము కార్యక్రమమును విజయ వంతం చేయవసినదిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎమ్.జితేంద్ర కోరారు.

## ఈ నెల 21న బండారు సంజీవ్ వాడపల్లి పాదయాత్ర

రావులపాలెం : స్థానిక టిడిపి కార్యాలంలో శనివారం టిడిపి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడపాటి కాసురెడ్డి మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు నియోజక వర్గ టిడిపి ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు తనయుడు యువ నాయకులు బండారు సంజీవ్ ఈనెల 21న తన పుట్టిన రోజు సందర్భముగా ఉదయం వాడపాలెంలో బయలుదేరి ధర్మపోరాట పాదయాత్రగా వాడపల్లి చేరుకుని వెంకన్నను దర్శించుకుంటారని తెలిపారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, అదే స్పూర్తితో రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కోరుతూ తన పుట్టిన రోజున చేస్తున్న ఈ ధర్మపోరాట పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నరసిహరాజు, చంద్రశేఖర్, గాడి క్రిస్టాఫర్, కోనాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి .....



కంచరపాలెం : ఎన్ .ఏడీ కూడలి సత్య వైన్ షాప్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు . గత కొంత కాలంగా రాత్రి సమయాల్లో వైన్ షాప్ ఎదురుగా వచ్చి నిద్రిస్తున్నాడని ప్రతి రోజు లాగే ఉదయం వైన్ షాప్ తెరిచేందుకు సిబ్బంది రావడంతో సదరు వ్యక్తి మెట్లపై మృతి చెంది ఉన్నాడు . వైన్ షాప్ నిర్వహకులు పోలీసులకు పిర్యాదు చేశారు . పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహన్ని కే.జి.హెచ్. కు తరిలించారు . మృతి చెందిన వ్యక్తికి ( 35 ) సంవత్సరాలు ఉంటాయని , ఎవరైన ఇతని బంధువులుంటే ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సి.ఐ మళ్ల శేషు తెలిపారు.

## కేరళా వరద బాధితులకు విరాళాలు సేకరణ

అచ్యుతాపురం: కేరళలో గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరికి సహాయార్థం అచ్యుతాపురంలో అన్ని షాపుల వద్ద విరాళాలు సేకరించడమైనది. ఇటీవల కేరళ రాష్ట్రాన్ని భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేశాయి. ఆస్తినష్టం, ప్రాణనష్టం భారీగా జరిగింది. బాధితుల సహాయార్థం విరాళాలు, సహాయ సహకారాలు అందించాలనే మానవతా దృక్పథంతో ప్రజలందరూ ఆదుకోవాలని కోరడమైనది. ఈ కార్యక్రమం లో సిపిఎం కన్వీనర్ ఆర్. రాము, కె.సోమునాయుడు, రమణ, రాములమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## స్టార్ పినాకిల్‌లో అరుదైన బ్లూబేబి గెండె శస్త్ర చికిత్స



విశాఖపట్నం: నగరంలోని స్టార్ పినాకిల్ హార్ట్ సెంటర్ నందు అత్యంత సంక్లిష్టమైన మరియు అరుదైన ఓపెన్ హార్ట్ సర్జరీ (ఆర్టీరియల్ స్విచ్ ఆపరేషన్)ని ఒక పసికందుకు విజయవంతంగా నిర్వహించారు. నూతనంగా జన్మించిన ఆ శిశు వుకు టిజిఎ (ట్రాన్స్ పొజిషన్ ఆఫ్ గ్రేట్ ఆర్టెరీస్) అని పిలువబడే సాధారణంగా 'బ్లూ బేబీ'గా వ్యవహరించే క్లిష్టమైన వ్యాధి ఉన్నట్లు రోగ నిర్ధారణ చేశారు. ఆరు రోజులు వయసున్న ఈ శిశుకు స్టార్ పినాకిల్ హార్ట్ సెంటర్ కార్డియాక్ డాక్టర్ల బృందం డాక్టర్ ఎల్. విజయ్ కన్సల్టెంట్ కార్డియాక్ సర్జన్ అండ్ కార్డియక్ ఎనస్థీసియా బృందం డాక్టర్ పిఎస్ఎస్ శ్రీనివాస్, డాక్టర్ టి. కిరణ్‌బాబు మరియు డాక్టర్ కె. సుబ్బారావులతో కూడిన నిపుణులు బృందం శస్త్ర చికిత్స నిర్వహించారు.

ఈ సందర్భంగా స్టార్ పినికిల్ వైద్యబృందం మాట్లాడుతూ ఈ టిజిఎ అత్యంత అరుదైనదని, లక్షమందిపిల్లలో 10 - 20 మందికి ఈ స్థితి రావచ్చునని అన్నారు. ఇది ప్రాణాలకు ముప్పు కల్గిస్తుందని అన్నారు.

మా డాక్టర్ల బృందం, కార్డియాక్ సంబంధిత క్లిష్టమైన శస్త్ర చికిత్సలకు అంతర్జాతీయ కేంద్రాలతో సరిపోలు విధంగా, అత్యున్నత క్లినికల్ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించే నైపుణ్యత కలిగి ఉన్నట్లు వివరించారు.

## కేరళ రాష్ట్రాన్ని ఆదుకోవడానికి విరాళాల సేకరణ



దేవరాపల్లి : కేరళ రాష్ట్రం భారీ వరదల కారణంగా ప్రాణ నష్టం ,ఆస్తి నష్టం జరిగింది .అక్కడ ప్రజలను ఆదుకోవడం కోసం సిపిఎం అధ్వర్యంలో శనివారం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి .వెంకన్న ,మండల కార్యదర్శి సి హెచ్ .రాజు ,డప్పు కళాకారుల సంఘము జిల్లా కార్యదర్శి కాటపల్లి అప్పారావు మాట్లడుతూ వరదల కారణంగా ఎన్నడూ చూడనంత నష్టం జరిగిందన్నారు .ఈ నేపథ్యంలో దేవరాపల్లి ప్రజల నుంచి 5000 రూపాయలు వసూల్ చేసి జిల్లా కార్యాలయం ద్వారా పంపిస్తామని వారు తెలిపారు .

## సంక్షేమ ఫలాలను సక్రమంగా అందే విధంగా చూడాలి

### రాష్ట్ర నాయిబ్రాహ్మణ కోపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ గంటుపల్లి నాగేశ్వరరావు



విశాఖపట్నం: నాయి బ్రాహ్మణులకు చేరాల్సిన సంక్షేమ ఫలాలను సక్రమంగా అందే విధంగా చూడాల్సిందిగా రాష్ట్ర నాయిబ్రాహ్మణ కోపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ గంటుపల్లి నాగేశ్వరరావు సంబంధిత అధికారులను కోరారు. శనివారం స్థానిక కలక్టర్ కార్యాలయం సమావేశమందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసి సంక్షేమ పథకాలలో భాగంగా నాయి బ్రాహ్మణుకు రూ. 30 కోట్ల బడ్జెట్ ను కేటాయించినప్పటికీ ఈ సంవత్సరం అదనంగా మరో రూ. 40 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1లక్ష 2 వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. దేవాలయాలలో బార్బర్ వృత్తిలో ఉన్న వారికి గతంలో ఇచ్చే జీతభత్యాలు పెంచడం జరిగిందని, అవి సక్రమంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టాల్పిందిగా ఎండోమెంట్స్ అధికారులను ఆదేశించారు. కె.జి.హెచ్, పోలీస్, ఎండోమెంట్స్ తదితర శాఖలలో బార్బర్ పోస్టుల ఖాళీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీలుంటే భర్తీచేయాలన్నారు. డ్వాక్రా గ్రూపుల వలె పొదుపు సంఘాల గ్రూపులుగా ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటుచేసి నాయి బ్రాహ్మణులకు చేయూతనివ్వాల్సిందిగా డిఆర్‌డిఎ అధికారులకు సూచించారు. వాయిద్య కళాకారులను గుర్తించే విధంగా ఐడి కార్డులను ఇవ్వడానికి తగు చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు. బ్యాంకు రుణాల మంజూరుకు సంబంధించి బ్యాంకు అధికారులు పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని కమిటీ సభ్యులు చైర్మన్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై ప్రత్యేకంగా బ్యాంకర్స్‌తో సమావేశాన్ని ఏర్పాటుచేసి చర్చించాల్పిందిగా జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. మున్సిపాలిటీ కాంప్లెక్స్‌లలో నాయి బ్రాహ్మణులకు కేటాయించిన షాపుల వివరాలను జివిఎంసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలాలవారిగా సొసైటి అధ్యక్షు పేర్లు, రిజిస్ట్రేషన్ వివరాలను తెలపాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలక్టర్ శ్రీమతి జి. సృజన, బిసి వెల్ఫేర్ డిడి నాగేశ్వరరావు, ఇడి బిసి కార్పొరేషన్ గీతాదేవి, జెడ్ పిసిఇఓ రమణమూర్తి, ఎల్‌డి ఎం శ్రీనాద్, డిఎంహెచ్ ఓ డాక్టర్ రమేష్, కె.జి.హెచ్. ఆర్ ఎం ఓ డాక్టర్ శాస్త్రీ, జివిఎంసి ఎండోమెంట్స్, పోలీస్ డిఆర్‌డిఎ కోపరేటివ్, పంచాయతీ శాఖల అధికారులు, నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## శేషారెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి పిఇటిల మద్దతు



కాకినాడ : ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి రాష్ట్ర శాసనమండలికి జరుగనున్న ఎన్నికలలో మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డికి తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల సహాయకుల సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. క్రియాశీలక రాజకీయాలలోనికి వచ్చి రానున్న 2019 జనవరి నెలలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయాలని సంఘం కోరింది. ఈమేరకు శనివారం చీడిగలో సంఘ జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు సిహెచ్ .రాజశేఖర్ కార్యదర్శి ఎల్.జార్జి పాత్రికేయులతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వ్యాయామ ఉపాధ్యయుల సంఘ గౌరవ అధ్యక్షునిగా ఉంటూ క్రీడాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న నల్లమిల్లి శేషారెడ్డి తన అనుభవాన్ని వినియోగించి రాబోయే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పోటీచేయాలని, అందుకు తమ సంపూర్ణ మద్దతు తెలియ జేస్తున్నామన్నా.రు.2007లో శేషారెడ్డి పిఇటి, పండిట్, ప్రధానోపాధ్యాయుల సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికై మున్సిపల్ ఉపాధ్యాయులకు 010ట్రెజరీ ద్వారా జీతాలు ఇప్పించడంలో కృషి చేసారన్నారు. అలాగే డిఎస్సీ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయించారన్నారు. 2009 నుండి2014 వరకు అనపర్తి ఎమ్మెల్యేగా రూ.5వందల కోట్ల నిధులతో నియాజక వర్గాన్ని అభివృద్ధి చేసారన్నారు.శేషారెడ్డి పట్టభద్రులఎన్నికలలో పోటీచేయాలని తీర్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జి.సునీల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వి. రవిరాజు,సురేష్ రాజు,ఎం.శ్రీధర్, రాష్ట్ర పిఇటి అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ గణపతి రామారావు,డివిఎస్ఆర్.మూర్తి రాష్ట్ర పిఇటి.అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## బంజరు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



అనంతగిరి : మండలకేంద్రం చిలకలగెడ్డ పంచాయతీ వెంకయ్యపాలెం గ్రామం నుంచి డి.గంగరాజు జెండా ఊపి పాద యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజరు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్క కుటుంబానికి 10 ఎకరాల భూమిని ఇవ్వాలని చట్టం ఉన్నా ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. అర్హులైన వారందరికీ పింఛన్లు ఇల్లు ఇవ్వాలని కోరారు. ఈనెల 27 తహసిల్దార్ కార్యాలయం ముట్టడి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొసియ సింగుల్ కొండలరావు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీషు, తెలుగు డిక్షనరీలు అందజేత


రావికమతం : గుడ్డిప గ్రామానికి చెదిన గుమ్మాల గణేశ్వరరావు అనే యువకులు గుడ్డిప ప్రాధమికోన్నత పాఠశాలకు చెందిన 4నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు తెలుగు నిఘం టువులు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను పాఠశాల హెచ్ఎం లక్ష్మణరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాల పిల్లలతో పోలిస్తే ఇంగ్లీషులో కొంత మేర వెనుక ఉన్నారన్నారు. అయితే ఇంగ్లీషుకు సంబంధించిన పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలు క్రమం తప్పకుండా చదివితే భాషపై పట్టు సాధించవచ్చునన్నారు. ఈ మేరకు పుస్తకాలను అందించిన గణేశ్వరరావును ఉపాధ్యాయులు అభినందించారు.

## వైజాగ్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో స్వచ్ఛభారత్



భీమునిపట్నం : దాకమర్రి వైజాగ్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ లో కళాశాల విద్యార్థులు ఉపాద్యాయులు మరియు సిబ్బంది కళా శాలలో శనివారం జరిగిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం లో పాల్గొ న్నారు. కళాశాల పరిసరాలు అన్నీసుబ్ర పరిచారు.కళాశాల డైరెక్టర్ ఎన్.గోపినాద్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత శుబ్రత పరిస రాలు శు బ్రత వలన ఆహ్లాదకర జీవితం కొనసాగుతుందని అందుకు విద్యా ర్థులు అలవాటు పడాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పైన వుందని అన్నారు.ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్ జి.శివ శంకరరావు, ఎస్.లక్ష్మణ రావు, వర్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కేరళ వరద బాధితులకు
## హోటల్ దసపల్లా యాజమాన్యం భూరి విరాళం



విశాఖపట్నం : విశాఖలోని దసపల్లా హోటల్ యాజమాన్యం తరుపున ఎం.రాఘవేంద్రరావు కేరళ వరద బాధితులకు రూ. 2లక్షల విరాళాన్ని చెక్ రూపంలో సిపిఎం నాయకులు సిహెచ్.నరసింగరావుకు ఇవ్వడం జరిగింది. సిపిఎం పార్టీ తరుపున రాఘవేంద్రరావుకి ధన్యవాదాలు తెలియజేశారు.

రాఘవేంద్రరావు కేరళ వరదల వార్తలు టి.విలో చూసి ఆందోళన చెందారు. తక్షణమే ఆర్థిక సహాయం చేయడం తమ కనీస బాధ్యతగా భావించి విరాళం అందిస్తున్నామని తెలియ జేశారు.

### శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా
## భారీ అన్న సమారాధన



అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు వడ్డన చేస్తున్న వైయస్ఆర్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం: 3వవార్డు పరిధిలో పెదగదిలి వద్ద శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి వారి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఎస్సి సంక్షేమ సంఘం పెదగదిలి వారు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో వైయస్ఆర్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భక్తులకు అన్న సమారాధన కొంత సేపు వడ్డించారు. వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరియు సంఘం వారి సహాయ సహకారాలతో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేయుటకు తన వంతు సహకారం వుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పమిడ కనకరాజు, గొలగాని శ్రీను, దూళి రఘు, అనంపల్లి ఈశ్వర రావు, పైడిరాజు, వినోద్, వెంకటలక్ష్మి, భాస్కర్, నాగరాజు, శ్రీధర్, కిషోర్, నాగేశ్వరరావు, ప్రసాద్, సంతోష్ మరియు ఎస్సి సంక్షేమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## కేరళ బాధితులకు ఆర్థిక సహాయం అందజేయండి

విశాఖపట్నం: కేరళ రాష్ట్రంలో తుఫాను/ వరదల కారణంగా తీవ్ర ఆర్థిక నష్టం కలిగియున్నందున, సదరు రాష్ట్రంలో గల వరద బాధితులకు ఆర్థిక సహాయం అందజేయు నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి సూచనల మేరకు, సదరు వరద బాధితులకు ఎవరైనా ఆర్థిక సహాయం చేయదలచినచో వారు జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో గల కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్, విశాఖపట్నం నందు నగదు గాని, డ్రాఫ్టు మరియు చెక్‌లు రూపంలో గాని అందజేసినచో వారిపేర్ల మీద సదరు ఆర్థిక సహాయ మొత్తాన్ని సంబంధిత కేరళ రాష్ట్ర ప్రభుత్వం వారికి అందజేయుట జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ
### బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి



అచ్యుతాపురం : పరిసరాలు పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి అన్నారు. శనివారం స్వచ్ఛ బ్రాండిక్స్ కార్య క్రమంలో భాగంగా బ్రాండిక్స్ ఆధ్వర్యంలో బ్రాండిక్స్ గేటునుండి ఏపీపీసి కార్యాలయం వరకు ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి శనివారం స్వచ్ఛ బ్రాండిక్స్ కార్యక్రమాన్ని చేపడుతున్నా మన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

## ఆకలి తో ఉన్నవారికి ఆకలి తీర్చడమే మాకు సంతోషం
### వుయ్ కేర్ యు సంస్థ ఇన్‌ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి

భీమునిపట్నం : రాత్రి అయితే నేమి పగలు అయితే నేమి ఆకలి తో ఉన్నవారికి ఆకలి తీర్చడమే మాకు సంతోషం కలుగుతుందని వుయ్ కేర్ యు సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక గీతామందిరం కళ్యాణ మండపం లోఅనిత, హేమంత్ వివాహ ఫంక్షన్ లో 200 మందికి సరిపడా మిగిలిన భోజనం ఉందని తెలుసుకొని మణికంఠ స్వీట్స్ అధినేత నాగరాజు బ్రదర్స్ వాహనం పై వెళ్ళి నట్లు తెలిపారు. కానీ రాత్రి కదా అని కొంచెం ఆలోచన కూడా రాకుండా ఆభోజనంను విశాఖ రైల్వేస్టేషన్ లోపుట్ ఫాత్ పై ఉన్నవారికి, ద్వారకా బస్ స్టాండ్ వీధుల్లో, జివిఎంసి సిబ్బందికి ఆకలి తీర్చినట్లు తెలిపారు. అప్పుడు వారు తింటుంటే నాకు వారి ఆకలి తీర్చాననీ ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. అంతే కాదు మాకు ప్లేట్లు,వాటర్ పేకెట్లు ఇచ్చిన వారికి పాదాభి వందనాలు తెలిపారు. నాతో పాటు సభ్యులు కూడా ఎంతో చక్కగా కార్యక్రమంలో పాల్గొం టున్నారని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పందిరి రాజు ,చెరుకూరి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు. తగరపువలస ప్రముఖ వ్యాపార వేత్త దుర్గా మూర్తి పెళ్ళిరోజు సందర్భంగా వారిజ బాలబాలికల అంధుల పాఠశాల లో పిల్లలకు భోజనం ఏర్పాటు చేసి నందుకు ధన్యవాదాలు తెలిపారు. మూర్తి ఈవిధంగా పెళ్ళి రోజు చేసు కోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారని శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

### అడివివరం శాఖా గ్రంథాలయంలో
## కంప్యూటర్ ఫర్నిచర్ ప్రారంభించిన మంత్రి గంటా శ్రీనివాసరావు

సింహాచలం : 72 వార్డు పరిధి సింహాచలం రాజవీధి లో గల శాఖా గ్రంథాలయానికి పూర్వస్నేహితులు అయినటువంటి టిడిపి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు పాశర్ల ప్రసాద్, పిన్నమనేని శ్రీనివాస్ ,జి .పి.రాజశేఖర్, జి.మధుబాబు కలిసి సుమారు 50 వేల రూపాయలవిలువచేసే కంప్యూటర్ మరియు ఐరన్ భీరువాలును గ్రంథాలయానికి బహుకరించిన నేపథ్యంలో వీటిని మంత్రి గంటా శ్రీనివసరావు గారు ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారం భించారు ఈ సందర్భంగా ధాతలు మంత్రిగారికి పులమాలవేసి సలువాకప్పి అప్పన్న ఫోటోను బహూకరించి సత్కరించారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని వై పద్మజ ,భిమిలీ నియోజకవర్గ ఇంచార్జి సి .విజయబాబు,టిడిపి 72 వ వార్డ్ అధ్యక్షుడు పిసిని వరహా నర్సింహం, టిడిపి నాయకుడు కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కర్రి స్వామి, నగర తెలుగుయువత ఉపాధ్యక్షులు సతివాడ శంకర రావు, గంట్ల కిరణ్, జన్మభూమి కమిటీ సబ్యులు నరావాల అప్పారావు, మేకా కాసు గోపాల్, లొడగల లక్ష్మీ ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## అత్యంత సమగ్రమైన నూతన బీమా పాలసీ

విశాఖపట్నం: డిహెచ్ఎఫ్ఎల్ జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ద్విచక్రవాహనాల కోసం కోకోరైడ్ పేరుతో ప్రత్యేకమైన నూతన బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పాలసీ ద్వారా మోటార్‌బైక్, స్కూటర్ వంటి ద్విచక్రవాహనాల యజమానులు యొక్క అవసరాలకు సరిపోయే విధంగా సమగ్రమైన బీమా పాలసీ అందిస్తారన్నారు. తన ప్రత్యేకతను నిలుపుకుంటూ, పాలసీ కేవలం రూ.586తోనే ప్రారంభమౌతుంది. కోకోరైడ్ అనేక ఎంపికలు, అదనపు కవరేజ్‌లను ఎంపిక చేసుకునే అవకాశాన్ని పాలసీ దారులకు కల్పిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా బీమా భద్రతను కోరుకునే వినియోగదారుడికి అందుబాటులో ఉన్నటువంటి అత్యంత సమగ్రమైన బీమా పాలసీ.

### చురుగ్గా సంపద కేంద్రం నిర్మాణం

గొలుగొండ : కొత్తమల్లంపేట సంపద కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో షెడ్ల నిర్మాణ పనులను చురుగ్గా మొదలెట్టారు. సంపద కేంద్రానికి నిధులు మంజూరు కావడంతో షెడ్లు పనులు పూర్తి అయిన వెంటనే చెత్తను కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## 25 నుండి శ్రీ షిరిడి సాయిబాబా శతాబ్ధి మహోత్సవములు



కంచరపాలెం : ఈ నెల 25 నుండి శ్రీ షిరిడి సాయిబాబా శతాబ్ది వంద సంవత్సరముల మహోత్సవములు జరుగునని విశాఖ జిల్లా శ్రీ షిరిడి సాయిబాబా మందిరాలు సేవా సమితి నిర్వాహకులు పేర్కొన్నారు .ఈ మేరకు శనివారం పంజాబ్ హోటల్ జంక్షన్ మర్రిపాలెం కంచరపాలెం ఆర్ అండ్ బి జంక్షన్ వెంకటేశ్వర స్వామి దేవాలయం ,శివాలయంలో పలు దేవాలయాల్లో ఈ మేరకు ఈ కార్యక్రమం పురష్కరించుకొని కరపత్రాలు పంపిణీ చేశారు. అదే విధంగా ముప్వల వాని పాలెం ,ఎఎస్ రాజా గ్రౌండ్స్ వేదికగా ఈ కార్యక్రమం జరుగునని పేర్కొన్నారు .ఆ రోజు శ్రీ లక్ష్మీ గణపతి హోమం కాకడ హారతి ,క్షీరాభిషేకం భక్తులు స్వహస్తాలతో బాబా ఆలయ అర్చకులు అందరూ కలిసి వేద పారాయణము సామూహిక సాయినామ సంకీర్తన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణము నిర్వహించానుని పేర్కొన్నారు. సాయంత్రం నుండి సాయం సంధ్యా హారతి, హనుమాన్ చాలిసా గానము శేజ్ హారతి నిర్వ హిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ ఆఖరి రోజైన ఆదివారం భగవత్ సేవా తత్పరులైన ప్రముఖులకు మరియు సహాయ సేవలో తరిస్తున్న కొంతమంది భక్తులకు ఆధ్యాత్మిక గౌరవ సత్కారం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి గంటా శ్రీనివాస రావు, శాసనసభ్యుడు వెలగ పూడి రామ కృష్ణబాబు, చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్కే ఈసీ ప్రాజెక్టు లిమిటెడ్ జి రాధాకృష్ణ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

### ఉత్తమ సాంఘీక జీవనానికి
## మనుధర్మం ఉపయుక్తం

విశాఖపట్నం: మేధావుల మన్ననలు పొందిన మనువు మహర్షి రచించిన ధర్మ బోధనలకు ప్రాచూర్యం కల్పించడానికి 'మను ధర్మం' పేరున పుస్తకాన్ని రాసి ఇటీవల విడుదల చేసినట్లు సీనియర్ పాత్రికేయులు ఎం.వి.ఆర్.శాస్త్రి అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మనుధర్మం పుస్తక ప్రతులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సనాతన హైందవ ధర్మంపై దాడులు జరుగుతున్నాయని అన్నారు.


ఈ ధర్మశాస్త్రంలో ప్రధానంగా అన్ని కాలాల్లో, అన్ని దేశాల్లో మానవుడి సాంఘీక జీవితానికి వర్తించే సూత్రాలు వున్నాయని పేర్కొన్నారు.

ఆధునిక విజ్ఞానం, అనుభవాల వెలుగులో మనువు మౌలిక బోధనలను ప్రకటించవలసిన అవసరం ఉందన్నారు. దీనికోసం ప్రభుత్వాలు, ధార్మికసంస్థలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ శాస్త్రవేత్త డా.కె.ఎస్.రావు, డా.బిఎస్.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గుండుపాలలో ఘోరం

### పదవ తరగతి బాలిక ఆత్మహత్యా..?? ఆత్మహత్యాయత్నం..??
### కేజిహెచ్ చికిత్స పొందుతున్న బాలిక
### ఆగస్టు 15 నుండి పాఠశాలకు రాలేదన్న ఉపాధ్యాయులు

గొలుగొండ : మండలంలోని గుండపాల గ్రామంలో ఆగస్టు 15 రాత్రి పదవ తరగతి బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో కేజిహెచ్‌సిలో చికిత్స పొందుతోందన్నారు. సంఘటన జరిగి ఇన్ని రోజులు గడిచినా బయట ప్రపంచానికి తెలియకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. సదరు బాలిక ఆత్మహత్యకు ప్రయత్నించిందా.? మరొక విధంగా గ్రామంలో ఎవరైనా ఇబ్బంది పెట్టరా..?? అనే విషయంపై అనేక రూపర్లు అల్లుకుంటున్నాయి. లిఖిత పూర్వక ఫిర్యాదు పోలీసులకు అందలేదు. గ్రామంలో కొంత మందిని విచారించినట్లు తెలిసింది. బాలిక ఇచ్చినా వాంగ్మూలం ఆధారంగానే కేసు ఉండే అవకాశం ఉంది. ఆగస్టు 15 నుండి బాలిక పాఠశాలకు రావడం లేదని ఎల్లవరం జెడ్పీ హైస్కూల్ సిబ్బంది తెలిపారు. బాలిక ఇంకా అపస్మారక స్థితి నుండి తేరుకోలేదని తెలిపింది. బాలిక నోరు తెరిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.



ఆడపిల్లలు

In the Honourable Court of the M.A.C.T. - cum - 4th Additional District Judge (S.C., S.T. Court)
Srikakulam
M.V.O.P. 230/2017

Between:
Adapa Ramanamma & Others ... Pititioners
And:
Majji Sankara Rao & Others ... Respondents

NOTICE

To
R1) Majji Sankara Rao
S/o Suryappadu
Driver of Tata Magic AP30TV0206
Madya Veedhi
Srikakulam Town & District

పిటిషనర్లు నష్ట పరిహారం నిమిత్తం మీపై మరియు ఇంకొక ఇద్దరు రెస్పాండెంట్లుపై పై నెంబరు కేసు వేసినారు. ఈ కేసు తే 29-8-2018 దీకి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున తే 29-8-2018 దీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా గాని లేక మీ యొక్క న్యాయవాది ద్వారా గాని హాజరు కావలెను. మీరు హాజరు కాని యెడల మిమ్ములను Ex-Parte చేసి మీ పరోక్షమున కేసు పరిష్కరింబడును.

శ్రీకాకుళం,
తేది : 02-08-2018.

జి. శంకరరావు,
అడ్వకేట్, శ్రీకాకుళం.

# టీడీపీ అరాచకత్వం కొనసాగనివ్వం

ధర్మసాగరం సెజ్ ఎంతమందికి ఉద్యోగాలిచ్చింది?

- నర్సీపట్నాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారు.. ఏమైంది?
- ఇసుక, మట్టిని అమ్ముకుంటున్నారు
- కేరళ విపత్తు హృదయాన్ని కలిచివేస్తోంది
- నర్సీపట్నం భారీ బహిరంగ సభలో జగన్



ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా విశాఖ జిల్లా నర్సీపట్నం ప్రాంతంలో జననేత జగన్‌కు సంఘీభావంగా అన్న జగన్ అడుగులో అడుగేస్తున్న విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు చొక్కాకుల వెంకటరావు, అనకాపల్లి పార్లమెంటరీ ఇన్‌ఛార్జి వరుదు కల్యాణి, భీమిలి నియోజకవర్గ నాయకులు వెంపాడ శ్రీనివాస రెడ్డి, చోడవరం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాడుగుల నియోజకవర్గ నాయకుడు, జిఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గవిరెడ్డి సన్యాసి నాయుడు తదితరులు .

నర్సీపట్నం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రతిపక్ష నేత వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచారని అన్నారు. ధర్మసాగరం ప్రాంతంలో సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి) ఏర్పాటు చేసి నియోజకవర్గ ప్రజలకు పరిశ్రమలు, ఉద్యోగాలు కల్పిస్తానన్న బాబు హామీ ఏమైందని ప్రశ్నించారు. నర్సీపట్నంను అభివృద్ధి చేసి మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానన్న హామీని టీడీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని చెప్పారు. నీరుచెట్టు కార్యక్రమం పేరుతో నియోజకవర్గంలోని చెరువుల్లో పూడిక తీసి మట్టిని అమ్ముకుంటున్నారని విమర్శించారు. చెరువులను తాటి చెట్టు లోతు తవ్వేసి ట్రాక్టర్ మట్టికి రూ.500 చొప్పున వసూలు చేస్తూ టీడీపీ నేతలు కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. నర్సీపట్నం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి 20 ఏళ్లకిందట వరాహ నదిపై దుక్కాడ వద్ద మొదలైన ప్రాజెక్టు ద్వారా నేటికీ నీరు అందుబాటులోకి రాలేదని అన్నారు. తుప్పుపట్టిన పైపులతో బురద నీరు వస్తోందనీ, నర్సీపట్నంలోని 65 వేల జనాభా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశాయి. నాతవరం మండలం సరుగుడు, అసనగిరి, బమిడకలద్దు, ముంతమామిడి గ్రామాల ప్రజలు అక్రమ లేటరైట్ తవ్వకాలు అడ్డుకున్నారని చెప్పి వారి గ్రామాల్లో పెన్షన్లు, విద్యుత్ రద్దు చేయడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. లేటరైట్‌లో టీడీపీ నాయకులకు 30శాతం వరకు పర్సంటేజిల రూపంలో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. నాతవరంలో 30పడకల ఆసుపత్రిని చేస్తామని ఇచ్చిన హామీ అమలు జరిగిందా అని ప్రశ్నించారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో 200లు ఇంటి పన్ను, ఆస్తి పన్ను ఏకంగా రూ.800లు పెరిగిపోయిందంటూ ఇక్కడ ప్రజానీకం తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అన్యాయంగా గ్రూపు హౌసింగ్ పథకం కింద రూ.3లక్షలు వాటాధనం కింద కట్టించుకుంటున్నారని, అది ఎంత వరకు సమంజసమని పేర్కొంటున్నారు. తాము అధికారంలో వస్తే గ్రూపు హౌస్ వాటా ధనం రూ.3లక్షలను మాఫీ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. నిజమైన నాయకుడిగా మాత్రమే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపి విజయసాయిరెడ్డి, విశాఖజిల్లా వైసిపి అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకరగణేష్, అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ వరుదు కళ్యాణి, చోడవరం మాజీ ఎమ్మెల్యే, కోఆర్డినేటర్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ డివి.సూర్యనారాయణ రాజు, కొయ్య ప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## కేరళ విపత్తు హృదయాన్ని కలిచివేస్తోంది

భారీ వరదలు, ఎడతెగని వర్షాలతో ఛిన్నాభిన్నమైన కేరళ పరిస్థితిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ వరద విపత్తు హృదయాన్ని కలిచివేస్తోందని ఆయన ట్వీట్ చేశారు. ఈ కష్టకాలంలో తన ప్రార్థనలు, ఆలోచనలు కేరళ ప్రజల వెన్నంటే ఉంటాయని అన్నారు. విపత్తుతో తల్లిడిల్లుతున్న కేరళ ప్రజలకు సహాయ, పునరావాస చర్యల్లో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.















తొలిసారిగా కాకినాడ పోర్టుకు క్యాప్‌సైజ్ వెసెల్

తొలిసారిగా కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ ఎంవి విజ్‌డమ్ పేరుగల ఒక 1,04,000 మెట్రిక్ టన్నుల పరిమాణపు క్యాప్‌సైజ్ వెస్సెల్‌ను రూపొందించింది. క్యాప్‌సైజ్ వెస్సెల్ అతి పెద్ద డైకార్గో వెస్సెల్ ఆంధ్రప్రదేశ్‌లోని మైనర్ పోర్టులన్నీ క్యాప్‌సైజ్ వెస్సెల్‌ను హ్యాండిల్ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.



# ఏపి సెట్ ఫలితాలు విడుదల

## 7.4 శాతం విద్యార్థుల అర్హత




ఆంధ్రా యూనివర్శిటీ : రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఏపిసెట్ ఫలితాలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాస రావు శనివారం ఉదయం విడుదల చేశారు. అనంతరం వివరాలు వెల్లడించారు. పరీక్షకు 42,663 మంది దరఖాస్తు చేసారని, వీరిలో 33320 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. 31 సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షలో 2481 మంది అర్హత సాధించడం జరిగిందన్నారు. ఉత్తీర్ణత శాతం 7.4 గా నమోదయిందన్నారు. పురుషుల్లో 17471 మంది హాజరవగా 1553 మంది ఉత్తీర్ణతతో 8.89 శాతం, మహిళల్లో 15489 మంది హాజరవగా 928 ఉత్తీర్ణతతో 5.85 శాతం అర్హత సాధించడం జరిగిందన్నారు. గత సంవత్సరం ఏపిసెట్‌లో 6.9 శాతం మంది అర్హత సాధించగా ఈ సంవత్సరం 7.4 శాతం అర్హత సాధించడం జరి గిందన్నారు. వర్సిటీ వరుసగా మూడో సంవత్సరం సమర్ధవంతం గా ఏపిసెట్ పరీక్షను నిర్వహిం చడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్స్‌గా, సహాయ ఆచార్యుల నియామకానికి ఏపి సెట్ అర్హత సాధించడం అవసర మన్నారు. వర్సిటీలో ఈ నెల 20వ తేదీన నిర్వహించాల్సిన జ్ఞాన భేరి కార్యక్రమాన్ని వాయిదా వేసా మన్నారు. మాజీ ప్రధాన వాజ్‌పాయ్ మృతితో కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ నెల 27న నిర్వహించాలని భావిస్తున్నామని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోతేదీని ఖరారు చేస్తామన్నారు. జ్ఞానభేరి కార్యక్రమానికి జాల్లకు రూ 10 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. కేవలం ఒకరోజు కార్యక్రమం కాకుండా, విద్యార్థుల ఆలోచనలను ఆవిష్కరణలుగా మలచే ప్రయత్నం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నేరుగా విద్యార్థులతో తన ఆలోచనలు పంచుకోవడం కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, రెక్టార్ ఆచార్య కె.గాయిత్రి దేవి, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, ఏపిసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు సలహా ఇవ్వాలని పవన్‌ను కోరతా

హైదరాబాద్: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు మండిపడ్డారు.

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన విజయవంతమైన నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు, శ్రేణులకు శిక్షణ ఇస్తామని కేటీఆర్ ట్విటర్ వేదికగా పేర్కొనడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. పెద్దలను గౌరవించే సంప్రదాయం ఏ మాత్రం లేదని ఆక్షేపించారు. తమకు శిక్షణకు అవసరం లేదని, సుధీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీనే కేటీఆర్‌కు శిక్షణ ఇస్తుందని చెప్పారు.

## విద్యార్థినులు ఒత్తిడులకు లోనుకాకుండా

# శారీరక మార్పులపై అవగాహన కలిగి ఉండాలి

- యుక్త వయసు పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలి
- మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన
- చదువుతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ముఖ్యం
- కళా ఆసుపత్రి అధినేత డా. పైడి వెంకట రమణ మూర్తి



విశాఖ సిటీ : విద్యార్థినులు చదువులో నిమగ్నమై, ఒత్తిడులకు లోనుకాకుండా శారీరక మార్పులపై కూడా సరియైన అవగాహన కలిగి ఉండాలని కళా ఆసుపత్రి అధినేత డా. పైడి వెంకట రమణ మూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని హెల్త్ క్లబ్ మరియు కళా హాస్పిటల్ వారు సంయుక్తంగా శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి వైద్య రంగ నిపుణులు సుమారు 20 మంది ఆయా రంగాలలో నిష్ణాతులైన డాక్టర్లు మరియు వైద్య సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు వారి తల్లిదండ్రులకు మరియు స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్ష నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో బి.పి., సుగర్, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, ఇ.సి.జి., అన్ని రకాల రక్త పరీక్షలు, డెంగ్యూ,




మలేరియా జ్వర పరీక్షలు స్త్రీ వైద్య నిపుణులచే ప్రత్యేకించి విద్యార్థినులకు పరీక్షలు చేయించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమంలో కళా హాస్పిటల్ అధినేత డా. పైడి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ యుక్త వయసు పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చదువుతో పాటు చిన్న చిన్న శారీరక సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఎటువంటి ఆరోగ్య సమస్యలూ దరి చేరవని, ప్రతీ ఒక్కరూ స్వచ్ఛ భారత్ నినాదాన్ని పాటించాలని ఆయన విద్యార్థినులకు పిలుపునిచ్చారు. మున్ముందు ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు ఉన్నా తమ ఆసుపత్రికి వచ్చి తనను సంప్రదించి ఉచితంగా వైద్య సలహాలను పొందవచ్చునని విద్యార్థినులకు హామీ ఇచ్చారు.

కళా ఆసుపత్రి చైర్మన్ డా. కళావతి మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్యంతో పాటు రుతు సంబంధిత సమస్యల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. మరియు రక్తహీనత బారినపడకుండా సరైన ఆహారం తీసుకోవాలన్నారు.


ప్రిన్సిపాల్ డా. శోభారాణి మాట్లాడుతూ ఈ శిబిరం పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

హెల్త్ క్లబ్ కన్వీనర్ డా. సిహెచ్. శాంతిదేవి మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థినులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్న మా సంకల్పానికి వెన్నుదన్నుగా నిలిచి అడిగిన వెంటనే తమ సహాయ సహకారాలందజేసిన కళా ఆసుపత్రి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.


ఒత్తిడులకు లోనుకాకుండా యుక్త వయస్సు పిల్లలు శారీరక మార్పులపై ఎప్పటికప్పుడు తల్లి లేదా డాక్టర్లను సంప్రదించి సరియైన అవగాహన పెంచుకోవాలన్నారు.

ఈ సందర్భంగా ఆర్. హరిత మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సరియైన ఆహారాన్ని తీసుకుని విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ శిబిరంలో విశాఖ డిగ్రీ మహిళా కళాశాల, విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు, గొల్లలపాలెం, రామ్‌నగర్, డాబాగార్డెన్స్, అల్లిపురం, పాత జైల్ రోడ్డు, పరిసర ప్రాంతాల నుండి ప్రజలు సుమారుగా 2500 మంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేయడంలో విజయవంతమైనది. ఈ శిబిరంలో కళాశాల సిబ్బంది, డా. ఆర్. హరిత, డా. పి.వి రమణా రెడ్డి, డా. ఆర్. మంజుల, బి. మాధురి, కళా ఆసుపత్రి సిబ్బంది డా. శిరీష, డా, బత్తులు, డా. గిరీష్, డా. మెర్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పీలాకు శుభాకాంక్షల వెల్లువ



గజమాలతో సత్కరించిన మలసాల రమణారావు ధనమ్మ దంపతులు



ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలుపుతున్న డిసిసిబి డైరెక్టర్ శ్రీనివాస్


అనకాపల్లి : అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ జన్మదినవేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గ నలుమూలలతో పాటు, జిల్లాలోని పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసారు. పెందుర్తిలో పీలా స్వగృహం నుంచి అనకాపల్లికి బయలు దేరిన పీలాకు మార్గ మధ్యలో రేబాక జంక్షన్ వద్ద, పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. జై పీలా అంటూ నినాదాలు చేస్తూ రేబాక నుంచి తెలుగు తమ్ముళ్లు భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టి ఊరేగింపుగా ఎమ్మెల్యే పీలాను అనకాపల్లి తీసుకువచ్చారు. అనకాపల్లికి వచ్చిన ఆయన సుంకరమెట్ట సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

ఈయనకు ఆలయ చైర్మన్ ధనాల విష్ణుచౌదరి అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూకాంబిక అమ్మవారి ఆలయం కళ్యాణమండపం మేడమీద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్‌చేసారు. ఆర్ఈసిఎస్ చైర్మన్ మలసాల రమణారావు, కుమార్‌రాజా, జెడ్పీటీసీ మలసాల ధనమ్మ, వేగి గోపీకృష్ణ, సిధిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, మళ్ల సురేంద్ర, బుద్ధ నాగజగదీష్, డాక్టర్ నారాయణరావు, కొణతాల వెంకటరావు, పల్లెల గంగా భవానీ, కొణతాల వెంకటసావిత్రి, తదితరులు గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంత బొకేలందించి శుభాకాంక్షలు తెలియజేసారు. సుమారు రెండు గంటల పాటు కార్యకర్తలు, నాయకులు, నియోజకవర్గంలో ప్రముఖులు విచ్చేసి అభినందనలు అందజేసారు. ఈసందర్భంగా నూకాంబిక ఆలయం కిటకిటలాడింది. పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు మేజిక్‌షో, అందరిని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో కొణతాల శ్రీను, పల్లెల నాగేశ్వరరావు, కాయల మురళీ శెట్టి వెంకటరమణ, సుంకర చంటి, నంబారు శ్రీను, నక్కా చెల్లయ్య, పూడి చిన్నారావు, పూడి రాజు, గంగిరెడ్ల గోవింద, పోల్నాటి అప్పారావు, దాడి నాగేశ్వరరావు, తదిరులు పాల్గొన్నారు.



నూకాంబికను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే పీలా దంపతులు




## రాజకీయాల్లోకి మరో క్రికెటర్!

దిల్లీ: మరో భారత క్రికెటర్ రాజకీయాల్లోకి వస్తున్నాడంటూ జోరుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అతనెవరో కాదు దిల్లీ క్రికెటర్ గౌతమ్ గంభీర్. వచ్చే ఎన్నికల్లో గంభీర్ పశ్చిమ దిల్లీ నుంచి బరిలోకి దిగబోతున్నట్లు కూడా తెలుస్తోంది. తాజాగా దిల్లీకి చెందిన ఓ భాజపా ప్రతినిధి మాట్లాడుతూ... నోట్ల రద్దు, జీఎస్టీ, అక్రమ కట్టడాల తొలగింపునకు అనుమతులు ఇవ్వడంతో స్థానిక భాజపా నాయకులపై దిల్లీ ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది.









VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com